www.trinetnews.com
# ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక

సంపుటి 01 | సంచిక 28 | ఎడిటర్ :వెంకటేశ్వర్లు రాపోలు | శనివారం సెప్టెంబర్ 05, 2026 | పేజీలు:12 | వెల.10/-

## హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రిలో అరుదైన చికిత్స... కడుపులో బ్లేడ్ ముక్కలు తొలగించారు..



2లో

## భారతీయ సాంప్రదాయ కళలను భావితరాలకు అందించా



12





# కొత్తగూడెం ప్రాజెక్టులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం

## కొత్తగూడెం ప్రాజెక్టుల పనుల్లో వేగం పెంచాలి

## అధికారులతో సీఎం రేవంత్ సమీక్ష

- పెండింగ్ పనులపై అధికారులకు ఆదేశాలు
- భూసేకరణ, టెండర్ల ప్రక్రియ వేగవంతం చేయాలి
- ప్రాజెక్టు పనులు సమన్వయంతో చేపట్టాలి
- రోజువారీ పురోగతిని పర్యవేక్షించాలని ఆదేశం
- పీకేజీ-1, పీకేజీ-2 పనులకు గడువులు
- పీకేజీ-1 పనులు డిసెంబర్ 2027 నాటికి పూర్తి
- పీకేజీ-2 పనులు అక్టోబర్ 2028 నాటికి పూర్తి
- పనుల్లో జాప్యానికి తావులేకుండా చర్యలు

**హైదరాబాద్:**
కొడంగల్ నియోజకవర్గంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల పనుల్లో వేగం పెంచాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. కొడంగల్ నియోజకవర్గంలోని ఇరిగేషన్ ప్రాజెక్టుల పురోగతిపై శుక్రవారం (సెప్టెంబర్ 4) అధికారులతో సీఎం రేవంత్ సమీక్ష సమావేశం నిర్వహించారు. గత సమీక్ష సమావేశంలో సూచనలకు అనుగుణంగా మక్తల్- నారాయణపేట్- కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి పంప్ హౌస్ పనులు ముందుకు తీసుకెళ్తున్నామని అధికారులు సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం రేవంత్ పలు సూచనలు చేశారు. ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచేందుకు ప్రతీ సంవత్సరానికి అవసరమైన బడ్జెట్ కు సంబంధించి పూర్తి వివరాలను అందించాలని ఆదేశించారు. ప్రాజెక్టుకు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. అలాగే, ఫేజ్-2 పనులకు వీలయినంత త్వరగా టెండర్లు పిలవాలని సూచించారు.ప్రాజెక్టు పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా ముందుకు వెళ్లేందుకు అవసరమైన నిధులపై స్పష్టమైన కార్యాచరణ ఉండాలని చెప్పారు.

భూసేకరణ, టెండర్లు, నిర్మాణ పనులను సమన్వయంతో చేపట్టి నిర్ణీత గడువులోగా ప్రాజెక్టును పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫేజ్-1 పనులను డిసెంబర్ 2027 నాటికి, ఫేజ్-2 పనులను అక్టోబర్ 2028 నాటికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు.

# చైనా విషయంలో భారత్ హెచ్చరికలు పెడచెవిన పెట్టాం



2లో

- చైనా చౌక వస్తువులతో యూరప్ పరిశ్రమలకు దెబ్బ
- విదేశీ సరఫరాదారులపై ఆధారపడాల్సిన పరిస్థితి
- మోదీ అప్పుడే హెచ్చరించారు: బెల్జియం ప్రధాని
- ఇకపై భారత్ హెచ్చరికలను వింటాం
- భారత్‌ను కీలక, విశ్వసనీయ భాగస్వామిగా చూస్తున్నాం
- బెల్జియం జాబితాలో భారత్ నెం.1
- ఆర్థిక, రాజకీయ, వ్యూహాత్మక బంధాలు బలోపేతం చేస్తాం

చైనా విషయంలో భారత్ తమను ముందుగానే హెచ్చరించిందని బెల్జియం ప్రధాని బార్ట్ డె వెవర్ అన్నారు. కానీ, అప్పుడు తాము వినకపోవడం వల్ల ఐరోపా దేశాలు అనేక సమస్యలు ఎదుర్కొన్నట్లు తెలిపారు. చౌకగా దొరికే విదేశీ వస్తువుల దిగుమతికి అనుమతించడంతో యూరప్ దేశాలను అవి ముంచెత్తాయని పేర్కొన్నారు. దీంతో ఐరోపా దేశాల్లో పరిశ్రమలు దెబ్బతినడమే కాకుండా విదేశీ సరఫరాదారులపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. దిల్లీలో జరిగిన కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ కార్యక్రమంలో బార్ట్ డె వెవర్ పాల్గొని మాట్లాడారు. "గడిచిపోయిన రోజులు ఐరోపాకు ఓ కఠినమైన వాస్తవాన్ని తెలియజేశాయి. చాలా కాలంగా మార్కెట్లలో విదేశీ ఉత్పత్తులను తక్కువ ధరలకే అమ్ముతుంటే చూస్తూ ఉండిపోయింది. దీంతో పారిశ్రామిక పునాది పూర్తిగా బలహీనపడిపోయింది.

# గోదావరి తీరంలోని ఆలయాలన్నీ అభివృద్ధి

- పుష్కరాల నాటికి పనులు పూర్తి చేయాలని నిర్ణయం
- భద్రాద్రి ఆలయ పునఃనిర్మాణానికి రూ.351 కోట్లు
- భక్తులు మెచ్చేలా రాములోరి ఆలయ పునర్నిర్మాణం
- భద్రాచలం పట్టణానికి మహర్దశ
- కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి: మంత్రి పొంగులేటి



**భద్రాచలం:**
భద్రాచలం సీతారామచంద్రస్వామివారిని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దర్శించుకున్నారు. ప్రధాన ఆలయంలోని స్వామి వారి ఎదుట ప్రత్యేక పూజలు నిర్వహించారు. రూ.351 కోట్లతో చేపడుతున్న ఆలయ పునఃనిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. భద్రాద్రి ఆలయాన్ని భక్తులు మెచ్చేలా విశాలంగా, అత్యంత సుందరంగా పునర్నిర్మిస్తామని తెలిపారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలో ఉన్న అన్ని ఆలయాలను పుష్కరాల నాటికి అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. అందులోభాగంగానే రాములోరి ఆలయాన్ని, భద్రాచలం పట్టణాన్ని కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేస్తామని తెలిపారు.

## సెప్టెంబర్ 6న BRSLP మీటింగ్.. ఎర్రవెల్లి ఫామ్ హౌస్ లో KCR అధ్యక్షతన భేటీ

**హైదరాబాద్:**
సెప్టెంబర్ 7 నుంచి తెలంగాణ శాసనసభ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో అసెంబ్లీలో

2లో



## ఆ ప్రచారం నమ్మొద్దు: కొండా సురేఖ

- నా పేరుతో వైరల్ అవుతున్న పోస్టులతో సంబంధం లేదు
- 'వెయిట్ ఈజ్ ఆల్‌మోస్ట్ ఓవర్' అంటూ పోస్టు వైరల్
- సోషల్ మీడియాలో ఫేక్ పోస్టులపై స్పందన
- అధికారిక ఖాతాల సమాచారాన్నే నమ్మాలి
- మీడియా, ప్రజలకు కొండా సురేఖ విజ్ఞప్తి



2లో..



2లో

## ఆమె తీరు ఆక్షేపణీయం: మహేశ్‌కుమార్ గౌడ్

- కాంగ్రెస్‌లో ప్రజాస్వామిక స్వేచ్ఛ.. క్రమశిక్షణలో కఠినత్వం
- ఆవేశం, ఆవేదనతో మాట్లాడారు.. ఇకపై అలా మాట్లాడొద్దు
- సమస్యలుంటే పీసీసీ అధ్యక్షుడిని సంప్రదించాలి
- అధిష్ఠానం, ఇన్‌ఛార్జ్‌ను కలిసి ఆవేదన చెప్పొచ్చు
- హద్దులు దాటితే చర్యలు తప్పవు
- కొండా సురేఖ బర్తరఫ్ బాధాకరం
- పార్టీలో కొనసాగితే అవకాశాలు ఇస్తాం: మహేశ్‌కుమార్ గౌడ్

**హైదరాబాద్:**
కొండా సురేఖ తీరు ఆక్షేపణీయంగా ఉండటంతోనే ఆమెపై కాంగ్రెస్ అధిష్ఠానం చర్యలు తీసుకుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.




# ఎవరీ నీతుబాయి?

- ధూల్‌పేట్ నుంచి ఐటీ కారిడార్ వరకు గంజాయి దందా
- కిరాణా దుకాణం ముసుగులో గంజాయి విక్రయాలు
- ఐటీ ఉద్యోగులు, విద్యార్థులే టార్గెట్
- రోజుకు రూ.5--10 లక్షల వరకు అమ్మకాలు
- 18కి పైగా ఎన్‌డీపీఎస్ కేసులు
- గతంలో పీడీ యాక్ట్ కింద నిర్బంధం
- 2024లో 22.6 కిలోల గంజాయి, రూ.22.10 లక్షల నగదు స్వాధీనం
- గంజాయి దందా నుంచి హవాలా వ్యాపారం వైపు
- అక్రమ సంపాదనపై ఈడీ దృష్టి
- నానక్‌రామ్‌గూడలో నీతుబాయి ఇంటిపై ఈడీ సోదాలు

2లో

## కాంగ్రెస్ అంతర్గత విభేదాలే కారణం



- బీసీ మహిళా మంత్రిపై చర్యలు దారుణం: డీకే అరుణ
- కొండా సురేఖ సీనియర్ నాయకురాలు
- వైఎస్సార్ కేబినెట్‌లో కలిసి పనిచేశాం
- కూతురు వ్యాఖ్యలకు తల్లిని బాధ్యురాలిని చేయడం సరికాదు
- బర్తరఫ్ మంచి పరిణామం కాదు: డీకే అరుణ
- రేవంత్‌పై సబితా ఇంద్రారెడ్డి తీవ్ర వ్యాఖ్యలు
- 'రాఖీ కట్టించుకున్నాడు.. గొంతు పిసికిండు'

2లో..



## హైవేపై ఆర్టీసీ బస్సు బోల్తా.. డ్రైవర్ మృతి

**జుక్కల్:**
కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం పరిధిలోని జాతీయ రహదారిపై కల్వర్టు గోడను ఢీకొట్టి ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. హైదరాబాద్ నుంచి బిచ్కుంద వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఘటన సమయంలో బస్సులో 13 మంది ప్రయాణికులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందగా, పలువురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను బిచ్కుంద ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న బాన్సువాడ డీఎస్పీ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బస్సులో ఇరుక్కున్న డ్రైవర్ మృతదేహాన్ని బయటకు తీశారు.

## పార్క్ చేస్తుండగా.. స్తంభాన్ని ఢీకొన్న ఇండిగో విమానం



మిగతాది 2లో

## కొండా సురేఖను బీఆర్ఎస్‌లోకి తీసుకోం!

- పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు నో ఎంట్రీ
- కొండా సురేఖకు బీఆర్ఎస్ తలుపులు మూసివేత
- కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికీ చోటు లేదు
- ఒకరిద్దరు మినహా ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నో
- ఎన్నికలకు ముందే కోమటిరెడ్డి సోదరులను తిరస్కరించాం
- రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తే డబ్బులకు అమ్ముడైనట్టే
- ఆరోపణలు చేసింది సురేఖ కాదు.. ఆమె కుమార్తె
- గతంలో పలువురు నేతలు బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేశారు

2లో..



# ఎవరీ నీతుబాయి?

మొదటిపేజీ తరువాయి
ఒకప్పుడు గుడుంబా విక్రయం.. ఆ తర్వాత గంజాయి వ్యాపారం.. చిన్న స్థాయిలో మొదలైన దందా క్రమంగా భారీ నెట్‌వర్క్‌గా మారింది. అనేక ప్రాంతాలకు విస్తరించింది. గంజాయి విక్రేతలు, వినియోగదారులకు ఆమె కేంద్రంగా మారింది. అంచెలంచెలుగా ఎదిగింది. ధూల్‌పేట్‌లో కిరాణా దుకాణం ముసుగులో గంజాయి విక్రయాలను ప్రారంభించిన నీతుబాయి.. రూ.కోట్లలో అక్రమ వ్యాపార సామ్రాజ్యానికి డాన్‌గా మారింది.

ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు, డెలివరీ సిబ్బంది లక్ష్యంగా సామ్రాజ్యాన్ని విస్తరించింది. వరుసగా కేసులు నమోదైనా, పలుమార్లు అరెస్టయినా.. పీడీ యాక్ట్ కింద నిర్బంధించినా.. ఆమె దందా మాత్రం కొనసాగడం గమనార్హం. గంజాయి విక్రయాలతో ప్రారంభించి హవాలా వ్యాపారం దిశగా సాగింది. ఈ క్రమంలోనే ఈడీ రంగంలోకి దిగింది. నీతుబాయి స్వస్థలం ధూల్‌పేట్ అయినప్పటికీ, ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు, డెలివరీ బాయ్‌లను లక్ష్యంగా చేసుకోవడానికి నానక్‌రామ్‌గూడలోని లోథాబస్తీలో చిన్న కిరాణా దుకాణం ప్రారంభించింది.

అంగూరిబాయి (అరుణాబాయి)తో పాటు ఒడిశా, ఏపీ సరిహద్దు ప్రాంతాల ద్వారా గంజాయి దిగుమతి చేసుకునేది. కిలో గంజాయిని రూ.8వేలకు కొనుగోలు చేసి 5 గ్రాముల చిన్న పొట్లాలుగా మార్చి, ఒక్కో పొట్లాన్ని రూ.500 కి విక్రయించేది. ఈ లెక్కన కిలోపై రూ. 50 వేల వరకు నికర లాభం ఆర్జించేది. ఆమె కుటుంబం మొత్తం కూడా ఈ అక్రమ వ్యాపారంలో భాగస్వాములే.

### రోజుకు సగటున రూ.10 లక్షల విక్రయాలు

రోజుకు సగటున రూ.5 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు అమ్మకాలు జరిగేవని ఎక్సైజ్ అధికారుల దాడుల్లో తేలింది. నీతుబాయిపై 18కి పైగా ఎన్‌డీపీఎస్ కేసులు ఉన్నాయి. గతంలో గచ్చిబౌలి పోలీసులు పీడీ యాక్ట్ ప్రయోగించారు. 2024లో 22.6 కిలోల గంజాయి, రూ.22.10 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.

నీతుబాయి నేరపూరిత సంపాదనపై ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పీఎంఎల్ఏ చట్టం కింద మనీ లాండరింగ్ కేసులు నమోదు చేసి, నానక్‌రామ్‌గూడలోని ఇంట్లో సోదాలు నిర్వహించింది. గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డి?రస్టిక్ట్ ప్రాంతాల్లో వేలాది మంది ఐటీ ఉద్యోగులు, ఉన్నత ఆదాయ వర్గాలను లక్ష్యంగా చేసుకొని ఆమె వ్యాపారాన్ని విస్తరించినట్లు ఎక్సైజ్ అధికారులు

# కొండా సురేఖ బర్తరఫ్‌పై డీకే అరుణ కీలక వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి
కొండా సురేఖ బర్తరఫ్ అంశానికి సంబంధించి బీజేపీ ఎంపీ డీకే అరుణ కీలక వ్యాఖ్యలు చేశారు. ఒక బీసీ మంత్రిపై చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలే కొండా సురేఖ బర్తరఫ్‌కు కారణమన్నారు. కొండా సురేఖ సీనియర్ నాయకురాలని, వైఎస్సార్ మంత్రి వర్గంలో ఇద్దరం కలిసి పని చేశామన్నారు. ఆమె కూతురు చేసిన వ్యాఖ్యలకు కొండా సురేఖను బాధ్యురాలిని చేసి బర్తరఫ్ చేయడమనేది మంచి పరిణామం కాదన్నారు. వికారాబాదు జిల్లా మర్పల్లిలో మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి.. కొండా సురేఖ బర్తరఫ్‌పై స్పందించారు. 'సీఎం రేవంత్‌రెడ్డి రాఖీ కట్టించుకున్నాడు.. గొంతు పిసికిండు' అని ఆమె విమర్శించారు. తనను నమ్ముకున్న మహిళలను అసెంబ్లీలో ముందు వరుసలో కూర్చోబెట్టిన అని చెప్పిన సీఎం రేవంత్.. ఇప్పుడు మాత్రం గొంతు పిసికిండు అని సబితా ఇంద్రారెడ్డి మండిపడ్డారు.

# ఆమె తీరు ఆక్షేపణీయం: మహేశ్‌కుమార్ గౌడ్

మొదటిపేజీ తరువాయి
కాంగ్రెస్‌లో ప్రజాస్వామిక స్వేచ్ఛ ఉంటుందని.. అయితే క్రమశిక్షణ విషయంలోనూ పార్టీ అంతే కఠినంగా ఉంటుందని చెప్పారు. దిల్లీలో మీడియాతో ఆయన మాట్లాడారు.

"కొండా సురేఖ కాంగ్రెస్‌లో కొనసాగుతానని చెప్పారు. పార్టీలో ఉంటే తప్పకుండా అవకాశం ఇస్తాం. గురువారం కొండా సురేఖ ఆవేశం, ఆవేదనతో మాట్లాడారు. ఇకపై అలా మాట్లాడకూడదని సూచిస్తున్నా. పార్టీలో ఎవరికైనా ఇబ్బందులుంటే నేరుగా పీసీసీ అధ్యక్షుడి వద్దకు వచ్చి చెప్పుకోవచ్చు. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్, పార్టీ ప్రధాన కార్యదర్శి, అధిష్ఠానాన్ని కలవచ్చు. తమ ఆవేదన వ్యక్తం చేయొచ్చు. అంతేకానీ ఇష్టారాజ్యంగా మాట్లాడితే కాంగ్రెస్ పార్టీ సహించదు. అదే సంకేతాన్ని గురువారం ఇచ్చింది. కొండా సురేఖ బర్తరఫ్ బాధాకరం.. అయితే ఆమె తీరు ఆక్షేపణీయంగా ఉండటంతోనే అధిష్ఠానం చర్యలు తీసుకుంది. ఏ కాంగ్రెస్ నాయకుడైనా హద్దులు దాటి మాట్లాడితే చర్యలు తప్పవు" అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.

# చెన్నూరులో కాంగ్రెస్ పార్టీలోకి భారీ చేరికలు.. మంత్రి వివేక్ సమక్షంలో కాంగ్రెస్ లో చేరిన గులాబీ శ్రేణులు..



చెన్నూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు నమోదయ్యాయి. శుక్రవారం ( సెప్టెంబర్ 4 ) మంత్రి వివేక్ వెంకటస్వామి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు గులాబీ శ్రేణులు. చెన్నూరు నియోజకవర్గంలోని కోటపల్లి మండలం రాంపూర్ గ్రామంలో పర్యటించారు మంత్రి వివేక్ వెంకటస్వామి. ఈ సందర్భంగా మంత్రి వివేక్ సమక్షంలో పెద్దఎత్తున కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు గులాబీ శ్రేణులు. ప్రభుత్వనిర్ణయాలు తెలుసుకోండి

రాంపూర్ గ్రామ సర్పంచ్ మనమంద రమేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు పలువురు వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, యువకులు, మహిళలు. నూతనంగా పార్టీలో చేరిన సర్పంచ్ మనమంద రమేష్‌తో పాటు గ్రామస్తులకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు మంత్రి వివేక్ వెంకటస్వామి. సీఎం రేవంత్ నేతృత్వంలోని 'ప్రజా పాలన' సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో సాగుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు నేతలు వెల్లడించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. రాంపూర్ గ్రామ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు మంత్రి వివేక్. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ఎన్నికల సమయంలో రాంపూర్ గ్రామానికి వచినప్పుడు సీసీ రోడ్లు కావాలని అడిగారని.. ఇప్పటికే రూ.26 లక్షల నిధులు ఇచ్చామని అన్నారు.రాంపూర్ గ్రామానికి అదనంగా మరో రూ.10 లక్షల నిధులు మంజూరు చేస్తున్నానని అన్నారు మంత్రి వివేక్. ప్రభుత్వనిర్ణయాలు తెలుసుకోండి

తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీ లు అమలు చేస్తున్నామని.. ప్రతీ ఇంటికి 200 వందల యూనిట్ల ఉచిత కరెంటు ఇస్తున్నామని.. మహిళలకు ఉచిత బస్సు, రేషన్ కార్డు దారులకు సన్న బియ్యం ఇస్తున్నామని అన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు కట్టించి ఇస్తున్నామని.. గతంలో డబుల్ బెడ్ రూం ఇస్తామని బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని అన్నారు. ఇప్పటికే గ్రామానికి 20 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని... ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఎవరికీ కూడా డబ్బులు ఇవ్వాల్సిన పని లేదని స్పష్టం చేశారు మంత్రి వివేక్.

# ఆ ప్రచారం నమ్మొద్దు.. బిగ్ అప్‌డేట్‌పై స్పందించిన కొండా సురేఖ

మొదటిపేజీ తరువాయి
త్వరలో బిగ్ అప్‌డేట్ ఉంటుందని తాను ప్రకటించినట్టు జరుగుతున్న ప్రచారాన్ని మాజీ మంత్రి కొండా సురేఖ ఖండించారు. కొండా సురేఖ పేరుతో ఉన్న ఫేస్‌బుక్ ఖాతాలో "త్వరలో బిగ్ అప్‌డేట్ ఉంటుంది. 'వెయిట్ ఈజ్ ఆల్‌మోస్ట్ ఓవర్'.." అంటూ ఆసక్తికర పోస్టు వైరల్ అయింది. దీనిపై కొండా సురేఖ స్పందించి.. సోషల్ మీడియా వేదికగా ఓ ప్రకటన విడుదల చేశారు.

"వివిధ సోషల్ మీడియా వేదికల్లో నా పేరుతో ప్రసారమవుతున్న పోస్టులతో మాకు ఎలాంటి సంబంధం లేదు. మీడియా ప్రతినిధులు, ప్రజలు కేవలం అధికారిక ఖాతాల ద్వారా వచ్చే సమాచారాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని కోరుతున్నాం" అని పోస్టు చేశారు.

మొదటిపేజీ తరువాయి
కొందరు దీనిని అవకాశంగా ఉపయోగించుకొని మేం పూర్తిగా వారిపై ఆధారపడేలా చేశారు (యూరోపియన్ మార్కెట్లలో చైనా వస్తువుల డంపింగ్‌ను పరోక్షంగా ప్రస్తావిస్తూ). కానీ, ఈ విషయాన్ని ఐరోపా కంటే ముందే భారత్ గుర్తించింది. ఇతర దేశాలపై అధారపడొద్దని మోదీ అప్పుడే మమ్మల్ని హెచ్చరించారు. కానీ మేం వినలేదు. ఇకపై వింటాం' అని బెల్జియం ప్రధాని పేర్కొన్నారు.

# చైనా విషయంలో భారత్ హెచ్చరికలు పెడచెవిన పెట్టాం

### మా జాబితాలో భారత్ నెం.1..

భౌగోళిక రాజకీయ అనిశ్చితి సమయంలో బ్రస్సెల్స్ ఇప్పుడు భారత్‌ను ఒక కీలక, విశ్వసనీయ భాగస్వామిగా చూస్తోందని బార్ట్ డె వెవర్ పేర్కొన్నారు. ప్రపంచ దేశాల జాబితాలో భారత్ లేకపోతే వారు ఓ ముఖ్యమైన స్నేహితుడిని కోల్పోతున్నట్లేనని అన్నారు. వాణిజ్య విధానాలను ఆకస్మికంగా మారుస్తూ.. సుంకాలు విధించే దేశాలు విశ్వసనీయమైనవి కాదని తెలిపారు. విశ్వాసం ఆధారంగా సంబంధాలు నిర్మించుకోగల భాగస్వాములు బెల్జియంకు ఎంతో అవసరమని తెలిపారు. భారత్‌తో బంధాలను ఆర్థికంగా, రాజకీయంగానే కాకుండా వ్యూహాత్మకంగానూ మరో స్థాయికి తీసుకెళ్లాలని తాము కోరుకుంటున్నట్లు తెలిపారు.

# సూర్యాపేట జిల్లాలో దారుణం: తాగుడుకు డబ్బులు ఇవ్వలేదని.. తల్లిని రోకలిబండతో బాది చంపిన కొడుకు..




సూర్యాపేట జిల్లాలో దారుణం జరిగింది. తాగుడుకు డబ్బులు ఇవ్వలేదని తల్లిని రోకలిబండతో బాది చంపేశాడు ఓ కిరాతకుడు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం రఘునాథపాలెంలో జరిగింది ఈ దారుణం. శుక్రవారం ( సెప్టెంబర్ 4 ) జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి...

రఘునాథపాలెం గ్రామానికి చెందిన షేక్ సుభాని తాగుడుకు బానిసయ్యాడు. తల్లిని తరచూ వేధిస్తూ ఉండేవాడు సుభాని. ఇవాళ కూడా తాగుడుకు డబ్బులు ఇవ్వాలని తల్లితో గొడవకు దిగాడు. తల్లి డబ్బులు ఇవ్వకపోవడంతో ఆవేశంతో రోకలిబండతో విచక్షణారహితంగా బాదాడు సుభాని. ఈ క్రమంలో తీవ్ర గాయాలైన తల్లి అక్కడికక్కడే మృతి చెందింది.ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు.

# సెప్టెంబర్ 6న BRSLP మీటింగ్.. ఎర్రవెల్లి ఫామ్ హౌస్ లో KCR అధ్యక్షతన భేటీ

మొదటిపేజీ తరువాయి
అనుసరించాల్సిన వ్యూహాలు, విధివిధానాలపై దిశానిర్దేశం చేసేందుకు సెప్టెంబర్ 6న బీఆర్ఎస్ శాసన సభాపక్ష సమావేశానికి పార్టీ అధినేత కేసీఆర్ పిలుపునిచ్చారు. ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్ హౌస్ లో ఈ కీలక సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి హాజరు కావాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కేసీఆర్ ఆదేశించారు. ప్రపంచపటాలు పరిశీలించండి

అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు గులాబీ బాస్ దిశానిర్దేశం చేయనున్నారు. రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపుతోన్న 22ఏ నిషేధిత జాబితా వివాదాన్ని అసెంబ్లీ సమావేశాల్లోపు పరిష్కరించాలని ప్రభుత్వానికి ప్రతిపక్ష బీఆర్ఎస్ డెడ్ లైన్ విధించిన విషయం తెలిసిందే. లేదంటే అసెంబ్లీ సమావేశాలను అడ్డుకుంటామని ప్రకటించింది. దీంతో అసెంబ్లీ సమావేశాలపై రాష్ట్ర రాజకీయాల్లో ఉత్కంఠ నెలకొంది.

### సెప్టెంబర్ 7నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు:

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల డేట్ ఫిక్స్ అయింది. 2026, సెప్టెంబర్ 7న ఉదయం 10 గంటలకు అసెంబ్లీ, శాసనమండలి సమావేశాలు ప్రారంభంకానున్నట్టు అసెంబ్లీ సెక్రటరీ రెండ్ల తిరుపతి శనివారం నోటిఫికేషన్ రిలీజ్ చేశారు. ఈ సమావేశాల్లో లోకసభ, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల కనీస వయసును 25 నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని ప్రభుత్వం కీలక తీర్మానం చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

# పార్క్ చేస్తుండగా.. స్తంభాన్ని ఢీకొన్న ఇండిగో విమానం

మొదటిపేజీ తరువాయి
విమానాశ్రయంలో పార్క్ చేస్తుండగా ఇండిగో విమానం స్తంభాన్ని ఢీకొట్టింది. జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్‌లో శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. నవీ ముంబయి నుంచి ఈ విమానం శ్రీనగర్ ఎయిర్‌పోర్టు కు చేరుకుంది. రన్‌వేపై ల్యాండ్ అయిన తర్వాత పార్కింగ్ ఏరియాకు వెళ్తుండగా.. అదుపుతప్పి విజువల్ డాకింగ్ గైడెన్స్ సిస్టమ్ ఉన్న స్తంభాన్ని ఢీకొంది. ఈ ఘటనలో విమానం ముందు భాగం కొంతమేర ధ్వంసమయ్యింది. అనంతరం ప్రయాణికులను సురక్షితంగా కిందకు దించేసినట్లు అధికారులు వెల్లడించారు. ఎవరికీ ఎలాంటి హానీ జరగలేదని పేర్కొన్నారు. ఘటనపై ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా దర్యాప్తు చేపట్టింది.

# హిట్ అండ్ రన్ కేసులో ఆనంద్ సాయి కొడుకు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు !



ఆనంద్ సాయి కొడుకు బి. శివ సందీప్ సాయి ఆనంద్ (23) డ్రైవింగ్ లైసెన్స్ ను సస్పెండ్ చేయాలని సైబరాబాద్ పోలీసులు నిర్ణయించారు. ఆగస్టు 31వ తేదీన ఉదయం.. నానక్‌రామ్‌గూడ ORR రోటరీ, ఖజాగూడలను కలిపే రోడ్ పై జరిగిన ప్రమాదంలో ఆనంద్ సాయి కొడుకుపై కేసు నమోదైన సంగతి తెలిసిందే.


పోలీసులు సందీప్ రక్త నమూనాలను ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీకి పంపారు. అతని డ్రగ్ టెస్ట్?లో నెగటివ్‌గా వచ్చినట్లు సమాచారం. దర్యాప్తు అధికారులు ఎఫ్ఎస్ఎల్ నివేదిక కోసం ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉండగా, సెప్టెంబర్ 2న సందీప్‌ను స్థానిక కోర్టులో హాజరుపర్చారు. అతనికి షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది.

హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో జరిగిన హిట్ అండ్ రన్ ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా.. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఓఆర్ఆర్ రోటరీ నుంచి ఖాజాగూడ వైపు వెళ్లే రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఇన్నోవా కారు ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆ వ్యక్తిని.. ఓ విద్యార్థి ఆస్పత్రికి తరలించే ప్రయత్నంలో మరో కారు వారిని ఢీకొట్టింది. ఈ ఘటనలో మొదట గాయపడిన వ్యక్తి మృతి చెందగా.. అతడిని కాపాడేందుకు వెళ్లిన విద్యార్థి గాయపడ్డాడు.

ఈ కేసులో ఆర్ట్ డైరెక్టర్, టీటీడీ బోర్డు డైరెక్టర్ ఆనంద్ సాయి కుమారుడు సందీప్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. రోడ్డు దాటుతున్న ఒకరిని కారు ఢీకొట్టగా.. గాయపడిన వ్యక్తిని రోడ్డుకు మరోవైపు ఉన్న హాస్పిటల్‌కు కాళ్లు, చేతులు పట్టుకొని దాటిస్తుండగా సందీప్ కారు ఓవర్ స్పీడ్ తో వచ్చి బలంగా ఢీకొట్టింది.

దీంతో అంతకుముందు జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మరణించగా, మరో క్యాబ్ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన జరిగాక ఆగి సాయం చేయాల్సిన సదరు నిందితుడు కారుతో సహా అక్కడి నుంచి పారిపోయాడు. పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు.

# హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రిలో అరుదైన చికిత్స... కడుపులో బ్లేడ్ ముక్కలు తొలగించారు..



వైద్యో నారాయణో హరి అంటారు... డాక్టర్లు దేవుడితో సమానమని చెప్పడానికి చాలా సంఘటనలు నిదర్శనంగా నిలిచాయి. ఇక బతకరు అనుకున్నవారిని సైతం డాక్టర్లు బతికించిన సందర్భాలు చాలా ఉన్నాయి. అలాంటి మరో ఘటన హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రిలో చోటు చేసుకుంది. కడుపులో బ్లేడ్ ముక్కలు తొలగించి అరుదైన చికిత్స చేసిన ఘనత సాధించారు ఉస్మానియా డాక్టర్లు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి...

రేజర్ బ్లేడ్ ముక్కలు ముక్కలు మింగిన 16 ఏళ్ళ బాలుడు హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రిలో చేరాడు. ఈ క్రమంలో ఎక్స్ రేలో కడుపులో బ్లేడ్ ముక్కలు ఉన్నట్లు గుర్తించిన డాక్టర్లు బాలుడిని జనరల్ వార్డ్ నుంచి గ్యాస్ట్రో ఎంటరాలజి విభాగానికి షిఫ్ట్ చేశారు. ఈ క్రమంలో ఎండోస్కోపీ ద్వారా బ్లేడ్ ముక్కలు తొలగించారు డాక్టర్లు. పదునైన బ్లేడ్ ముక్కలు కావడంతో తీవ్ర సవాళ్లతో కూడిన ఈ చికిత్స అత్యంత జాగ్రత్తగా నిర్వహించారు డాక్టర్లు.

బ్లేడ్ ముక్కలతో కడుపు లోపలి భాగాలకు గాయాలు, పేగులు చిల్లులు పడే ప్రమాదం ఉందని.. అయినా అత్యంత జాగ్రత్తగా మినిమల్లీ ఇన్వేసివ్ పద్ధతిలో విజయవంతంగా తొలగించామని అంటున్నారు డాక్టర్లు. ప్రొఫెసర్, హెచ్ఓడీ డాక్టర్ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ చికిత్స నిర్వహించారు.

ఇతర వైద్యులు, సిబ్బంది సహకారంతో ఆపరేషన్ విజయవంతం అయ్యిందని.. చికిత్స అనంతరం బాలుడి ఆరోగ్యం నిలకడగా.. ప్రస్తుతం బాగానే ఉన్నట్లు వెల్లడించారు డాక్టర్లు. అతికష్టమైన చికిత్సను సమర్థవంతంగా నిర్వహించి తమ బిడ్డ ప్రాణాలు రక్షించిన డాక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు బాలుడి తల్లిదండ్రులు.

# కొండా సురేఖను బీఆర్ఎస్‌లోకి తీసుకోం: మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి



పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల్లో కొందరు తిరిగి బీఆర్ఎస్ లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని.. వారిలో ఒకరిద్దరు మినహా ఎవరినీ తీసుకోబోమని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి తెలిపారు. మీడియాతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. మాజీ మంత్రి కొండా సురేఖ అంశంపైనా జగదీశ్‌రెడ్డి స్పందించారు.

"పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లోకి తీసుకునేది లేదని చాలా మంది నేతలకు ఇప్పటికే చెప్పాం. కొండా సురేఖను కూడా పార్టీలోకి తీసుకోం. బీఆర్ఎస్‌లోకి వచ్చేందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దరఖాస్తు చేసినా ఆయన్ను తీసుకునేది లేదు. ఎన్నికలకు ముందు కోమటిరెడ్డి సోదరులు బీఆర్ఎస్‌లోకి వస్తామంటే పార్టీ తిరస్కరించింది. రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తే డబ్బులకు అమ్ముడుపోయినట్టే. ఆరోపణలు చేసింది కొండా సురేఖ కాదు.. ఆమె కుమార్తె. గతంలో రాజగోపాల్‌రెడ్డితో పాటు చాలా మంది నేతలు నేరుగా పార్టీపై ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానాన్ని, ఏఐసీసీ ఇన్‌ఛార్జ్‌లను తప్పుబట్టారు" అని జగదీశ్‌రెడ్డి అన్నారు.

# నిరుద్యోగ విద్యార్థుల మధ్య ఎమ్మెల్యే ముఠా గోపాల్ జన్మదిన వేడుకలు

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 4:**
ముషిరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే ముఠా గోపాల్ జన్మదిన వేడుకలు శుక్రవారం సిటీ సెంట్రల్ లైబ్రరీలో ఘనంగా నిర్వహించారు. కవి, వ్యాసకర్త, సమీక్షకులు, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు మిద్దె సురేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువ నాయకులు ముఠా జై సింహా పాల్గొని కేక్ కట్ చేసి ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు పోటీ పరీక్షల పుస్తకాలను అందించడం అభినందనీయమన్నారు . ముఠా గోపాల్ ముషీరాబాద్ నియోజకవర్గంలో మచ్చ లేని నాయకుడిగా పేరు ప్రఖ్యాతిని సంపాదించుకున్నారని తెలిపారు. ముషీరాబాద్ ప్రజల అండ ముఠా గోపాల్ కు ఉందన్నారు. వచ్చే ఎన్నికలలో బిఆర్ఎస్



పార్టీ కచ్చితంగా అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.



యువత విద్యా రంగంలో ముందుకు సాగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు . కార్యక్రమంలో గాంధీనగర్ డివిజన్ ప్రెసిడెంట్ రాకేష్, జనరల్ సెక్రటరీ శ్రీకాంత్, సీనియర్ నాయకులు ముఠా నరేష్, శ్రీనివాస్ గుప్తా, సత్యనారాయణ, ప్రేమ్, జాగీర్, రవి శంకర్ గుప్తా, కుమారస్వామి, సంతోష్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# అంబర్ పేట్ లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**ఆకట్టుకున్న కృష్ణుని వేషధారణలో చిన్నారులు**
**వివిధ ప్రాంతాలలో ఉట్టి కొట్టిన యువకులు**

**హైదరాబాద్, చిక్కడపల్లి ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 4:**
శ్రీమహావిష్ణువు అవతారాల్లో శ్రీకృష్ణుడి అవతారం అత్యంత విశిష్టమైనది. అధర్మాన్ని అంతం చేసి ధర్మాన్ని స్థాపించేందుకు భగవంతుడు శ్రీకృష్ణుడిగా అవతరించిన పవిత్రమైన రోజునే శ్రీకృష్ణ జన్మాష్టమిగా భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. కృష్ణాష్టమి సందర్భంగా శ్రీకృష్ణ ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ఉపవాసాలతో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు . తల్లిదండ్రులు తమ చిన్నారులను శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలో అలంకరించడం పండుగకు మరింత శోభను తీసుకొచ్చారు.



కృష్ణాష్టమి వేడుకల్లో ఉట్టి కొట్టే కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శ్రీకృష్ణుడి బాల్య లీలలను గుర్తుచేసుకుంటూ యువత, చిన్నారులు ఉత్సాహంగా ఉట్టి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పలు ప్రాంతాల్లో సాంస్కృతిక కోలాటాలు, నృత్య ప్రదర్శనలు, భజన



కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీకృష్ణుడు కేవలం భక్తులకు ఆరాధ్యదైవం మాత్రమే కాకుండా, మానవాళికి మార్గదర్శకుడని ఉజ్జల సంస్థ అధ్యక్షురాలు ఎం. లక్ష్మీ అన్నారు. మహాభారత యుద్ధ సమయంలో అర్జునుడికి శ్రీకృష్ణుడు అందించిన భగవద్గీత బోధనలు



నేటికీ ప్రపంచానికి స్ఫూర్తినిస్తున్నాయని తెలిపారు. ధర్మాన్ని కాపాడేవారిని ధర్మమే కాపాడుతుందనే సందేశాన్ని ప్రజలు జీవితంలో ఆచరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమాజంలో మానవతా విలువలను పెంపొందించాలన్నారు.

# అర్హత కలిగిన ఒక్క ఓటు కూడా తొలగించబడదు..

**ఓటర్లకు భరోసా కల్పించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి..**

**తార్నాక, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 4 :**
అర్హత కలిగిన ఏ ఒక్క ఓటు కూడా తొలగించబడదని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని తార్నాక, లాలాపేట్ హియరింగ్ కేంద్రాలను శుక్రవారం జీహెచ్ఎంసి అదనపు కమిషనర్ (ఎన్నికలు) సంతోష్ తో కలిసి ఆయన సందర్శించి ఓటర్ల పునఃపరిశీలన ప్రక్రియను పరిశీలించారు. హియరింగ్ కు హాజరైన ఓటర్లతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, సందేహాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బిఎల్ఓ లు, బిఎల్ఓ సూపర్‌వైజర్లు, ఏఈఆర్ఓ లకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా అన్ మ్యాపింగ్ , అనోమలిస్ కు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన ఆధారాలు, డాక్యుమెంట్ ను సక్రమంగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఓటర్ కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా



నిబంధనల ప్రకారం పారదర్శకంగా హియరింగ్స్ నిర్వహించాలని సూచించారు. ప్రస్తుతం చేపడుతున్న ప్రక్రియ ఏ ఎస్ ఎస్ డి (అబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్ అండ్ డూప్లికేట్) ఓటర్ల వివరాల పునఃపరిశీలనలో భాగమని అధికారులు తెలిపారు.

**ఫారం - 6, 7, 8 ద్వారా దరఖాస్తులకు అవకాశం.**
ఓటరు నమోదు, వివరాల్లో మార్పులు, తొలగింపు లేదా ఇతర సవరణల కోసం ఫారం-6, ఫారం-7, ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఓటర్లు తమ క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ ను సంబంధిత పోలింగ్ కేంద్రాలు, హెల్ప్‌డెస్క్‌లు, ఈఆర్ఓ కార్యాలయంలో సమర్పించవచ్చని సూచించారు. ఓటర్లలో విస్తృత అవగాహన కల్పించేందుకు 70 - సికింద్రాబాద్ నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను నిర్వహించనున్నారు. తొలి దశలో సెప్టెంబర్ 5, 6 తేదీల్లో, రెండో దశలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఏ ఎస్ ఎస్ డి, అన్ మ్యాపింగ్ , అనోమలిస్, క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ ను, వివిధ ఫారాల ద్వారా దరఖాస్తు చేసుకునే విధానంపై ఓటర్లకు అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమంలో ఈఆర్ఓ ఎంఎన్ఆర్ జ్యోతి, ఏఈఆర్ఓ ఎస్ అండ్ డిసి, సుధీర్ సింగ్, అదనపు ఏఈఆర్ఓ నాగమణి, బిఎల్ఓ లు, బిఎల్ఓ సూపర్‌వైజర్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటు వివరాలను పరిశీలించుకోవాలని ఎన్నికల అధికారులు విజ్ఞప్తి చేశారు.

# హామీలను అమలు మరిచిన కాంగ్రెస్ ప్రభుత్వం: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**హైదరాబాద్, నాచారం, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 4:**
కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం 1000 రోజుల పాలనలో తెలంగాణ ప్రజలను మోసం చేసిందని ఆరోపిస్తూ భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం నాచారం, హెచ్ఎంటి నగర్ డివిజన్ల బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్, మేడల మల్లికార్జున్ గౌడ్ ఆధ్వర్యంలో యూకే సినీప్లెక్స్ వద్ద రోడ్డుపై వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి హాజరై రోడ్డుపై వంటావార్పు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలు, 420 హామీల పేరుతో



అధికారంలోకి వచ్చి, ప్రస్తుతం రాష్ట్ర ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని విమర్శించారు.
ఒకవైపు హైడ్రా పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల నివాసాలను కూల్చివేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు 22-ఏ నిషేధిత జాబితా పేరుతో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న ఇళ్లను సైతం నిషేధిత జాబితాలో చేర్చి ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నారని అన్నారు.
ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే తగిన గుణపాఠం చెబుతారని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దేవేందర్ రెడ్డి, ప్రభుదాస్, శ్రీనివాస్ రెడ్డి తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఓయూ లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**ఉస్మానియా యూనివర్సిటీ...**

**హైదారాబాద్, తార్నాక, ట్రైనెట్ న్యూస్ సెప్టెంబరు 4:**
ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ కళాశాల వద్ద వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి యాదవ కార్పొరేషన్ చైర్మన్ జగదీష్ యాదవ్, బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చిరంజీవులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంప్రదాయ ఉట్టి కొట్టే కార్యక్రమంలో అతిథులు, విద్యార్థి సంఘాల నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం పలువురు మాట్లాడుతూ శ్రీకృష్ణుడు తన జీవితంలో ధర్మాన్ని, న్యాయాన్ని, సమాజ శ్రేయస్సును బోధించారని పేర్కొన్నారు.
కృష్ణ తత్వం నుంచి నేటి యువత నేర్చుకోవాల్సిన అవసరం



ఉందని అన్నారు. సమాజంలో ధర్మబద్ధమైన విలువలను పెంపొందిస్తూ, అందరూ కలలు కంటున్న సామాజిక తెలంగాణ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రమేష్ యాదవ్, మహేష్ గౌడ్, చేరాల వంశీ, సైదులు యాదవ్, మానవతా రాయ్, వేణు తో పాటు పలువురు విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ కృష్ణాష్టమి వేడుకలో పాల్గొన్న శ్రీ మర్రి పురురవ రెడ్డి గారు

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్ , సెప్టెంబర్ 4:**





శ్రీ కృష్ణాష్టమిని పురస్కరించుకుని, స్థానిక బీజేపీ నాయకులు మంచాల గోపి గారు మొండా మార్కెట్ రోడ్డులో ఉన్న సాయిబాబా దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో రాష్ట్ర బీజేపీ యువ నాయకులు శ్రీ మర్రి పురురవ రెడ్డి గారు పాల్గొన్నారు.
ముందుగా శ్రీ మర్రి పురురవ రెడ్డి గారు శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అల్పాహార వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.
ఈ సందర్భంగా మంచాల గోపి గారు, అంజిరెడ్డి గారు శ్రీ మర్రి పురురవ రెడ్డి గారికి శ్రీకృష్ణుడు, శ్రీ సాయిబాబా తీర్థప్రసాదాలను అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ శ్రీ రాజశేఖర్ రెడ్డి గారు, శ్రీ గణేష్ గారు, చంద్రపాల్ రెడ్డి, బి. వికాస్, కె. నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కృష్ణస్వామి ముదిరాజ్ 133వ జయంతి వేడుకలు



**హైదరాబాద్ , ట్రైనెట్ న్యూస్,సెప్టెంబర్ 4 :**
హైదరాబాద్ నగర తొలి మేయర్, పత్రికా సంపాదకుడు, సంఘ సంస్కర్త కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ 133వ జయంతి వేడుకలు శుక్రవారం సికింద్రాబాద్ న్యూ బోయిగూడలోని ముదిరాజ్ భవన్ ఘనంగా నిర్వహించారు. కొర్వి కృష్ణ స్వామి ముదిరాజ్ జయంతి ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు జి దివాకర్ ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన ఉత్సవాలకు
ముఖ్య అతిథులుగా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీసీ సంక్షేమ శాఖ సలహాదారుడు వి. హనుమంతరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణస్వామి ముదిరాజ్ జీవిత చరిత్ర పుస్తకాలను విడుదల చేశారు. అణగారిన వర్గాల ప్రజల కోసం ఎంతో సేవ చేసిన కొరివి కృష్ణస్వామి అందరికీ ఆదర్శనీయుడని వారన్నారు.
ఈ సందర్భంగా ఇటీవల నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గా ఎన్నికైన ఉమారాణి, సంగారెడ్డి జిల్లా సదాశివపేట మున్సిపాలిటీ చైర్మన్ అంజమ్మ ను అతిథులు సన్మానించారు.
ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారులు దినకర్ బాబు, జగన్మోహన్, ముదిరాజ్ మహాసభ నాయకులు కృష్ణమూర్తి, మన్మోహన్, చెన్నయ్య, శారద, సురేందర్ వెంకట్రావు, మంద శ్రీనివాస్, ఆంజనేయులు, నీలం శ్రీనివాస్, ప్రకాష్, శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

# డా. వర్షిత్ రెడ్డి కుటుంబానికి బీజేపీ అండగా ఉంటుంది: ఎంపీ డా. లక్ష్మణ్..

**యశోద ఆసుపత్రిలో వర్షిత్ తల్లిని పరామర్శించిన డా. కె..లక్ష్మణ్..**

**సికింద్రాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 4:**
నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు డా. వర్షిత్ రెడ్డి కుటుంబంపై జరిగిన దాడిని బీజేపీ తీవ్రంగా ఖండించింది. రాజకీయ విభేదాలను దాడులు, బెదిరింపుల రూపంలో వ్యక్తం చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డా. వర్షిత్ రెడ్డి తల్లిని బీజేపీ ఎంపీ డా. కె.



లక్ష్మణ్, సికింద్రాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు భరత్ గౌడ్, డా. శ్రీరామ్ వెంకటేష్ తదితర నాయకులు పరామర్శించారు. డా. లక్ష్మణ్ ఆమెకు ధైర్యం చెప్పి, కుటుంబానికి బీజేపీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. డా. వరశిత్ రెడ్డి ఇంటిపై జరిగిన దాడి ఘటనపై డా. కె. లక్ష్మణ్ కాంగ్రెస్ పార్టీ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకుల కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడటం సరికాదన్నారు. రాజకీయ పోరాటం ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే జరగాలని, దాడులు, బెదిరింపులకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఘటనకు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భరత్ గౌడ్ మాట్లాడుతూ డా. వరశిత్ రెడ్డి కుటుంబానికి తెలంగాణ బీజేపీ నాయకత్వం, కార్యకర్తలు అండగా ఉంటారని తెలిపారు. కష్టకాలంలో ప్రతి బీజేపీ కార్యకర్త కుటుంబం వెంటే పార్టీ ఉంటుందని స్పష్టం చేశారు. బీజేపీ నాయకుడు డా. శ్రీరామ్ వెంకటేష్ యశోద ఆసుపత్రిని సందర్శించి డా. వర్షిత్ రెడ్డి తల్లి, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కుటుంబానికి తన సంపూర్ణ సంఘీభావాన్ని తెలిపారు.

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
శనివారం సెప్టెంబర్ 05, 2026
www.trinetnews.com

# సాధు సంత్‌లకు రూ.25 వేల గౌరవ వేతనం ఇవ్వాలి

**-- గ్రామాల్లో ఆలయాల నిర్మాణం చేపట్టాలి**
**-- ఉమ్మడి ఖమ్మం జిల్లా సాధు సంత్‌ల జేఏసీ నూతన కమిటీ ఏకగ్రీవం**

ట్రైనెట్ న్యూస్ సెప్టెంబరు 4:
ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేస్తున్న సాధు సంత్‌లకు ప్రభుత్వం రూ.25 వేల గౌరవ వేతనం అందించాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా సాధు సంత్‌ల జేఏసీ నూతన చైర్మన్ తేజావత్ రాములు నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మార్కెట్ యార్డులో నిర్వహించిన సాధు



సంత్‌ల సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.జేఏసీ చైర్మన్‌గా తేజావత్ రాములు నాయక్, గౌరవాధ్యక్షులుగా బానోత్ చందు, గుగులోత్ బిచ్చా, వైస్ చైర్మన్లుగా మాళోత్ రమేష్, జాటోత్ శంకర్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా భూక్య బాలు, ట్రెజరర్‌గా ధరమ్‌సోత్ లచ్చు, కార్యదర్శులుగా బానోత్ బద్య, బానోత్ హతీరాం, బానోత్ పాండు, ధరావత్ సక్రు, బానోత్ మిట్టు, సపావట్ సోమ్లా, ధరావత్ రాందాస్, లకావత్ దేస్యలను నియమించారు.ఈ సందర్భంగా రాములు నాయక్ మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ కోసం ప్రతి గ్రామంలో ఆలయాల నిర్మాణం చేపట్టాలని కోరారు. సాధు సంత్‌లు ధర్మ పరిరక్షణకు నిరంతరం సేవలందిస్తున్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దీప, ధూప, నైవేద్యాల నిర్వహణతో పాటు వారి సేవలను గుర్తించి ప్రతి సాధు సంత్‌కు నెలకు రూ.25 వేల గౌరవ వేతనం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.అనంతరం నూతన కమిటీని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బంజారా సంఘాల జేఏసీ చైర్మన్ బానోత్ వీరు నాయక్, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు మాళోత్ శివ నాయక్, సేవాలాల్ సేన రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరావత్ కృష్ణ, సోషల్ మీడియా జేఏసీ కో కన్వీనర్ వినోద్ నాయక్, రాకేష్ శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సాధు సంత్‌లు ఆంగోత్ రాజు, బిచ్చా, గురు ప్రసాద్, రాందాస్,

# రైతుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు: చింత ప్రభాకర్

సంగారెడ్డి, ట్రైనెట్ న్యూస్ సెప్టెంబరు 4:







రైతుల సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు అవగాహన సదస్సు, వంటావార్పు కార్యక్రమాలు నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల కోసం అమలు చేసిన రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్ తదితర పథకాలను వివరించారు. రైతు కుటుంబాలకు పెట్టుబడి సాయం, ఆపద సమయంలో ఆర్థిక భరోసా కల్పించామని చింత ప్రభాకర్ తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఎన్నికల హామీల్లో అనేకం అమలు కాలేదని ఆయన విమర్శించారు. "హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా వెయ్యి రోజుల పాలనను ఎలా సంబరంగా జరుపుకుంటారు?" అని ప్రశ్నించారు.
ప్రస్తుతం రైతులు ఎరువులు, విత్తనాల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వ్యవసాయానికి అవసరమైన వనరులను సకాలంలో అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలు, జిల్లా కేంద్రాల్లో రైతుల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని చింత ప్రభాకర్ పేర్కొన్నారు.కార్యక్రమంలో మాజీ జణజ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, సీనియర్ నాయకులు డాక్టర్ శ్రీహరి, కొండల్ రెడ్డి, మనోహర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు విఠల్, మధుసూదన్ రెడ్డి, చక్రపాణి, ఆంజనేయులు, సదాశివపేట పట్టణ అధ్యక్షుడు చీల మల్లన్న, పట్టణ కార్యదర్శి వీరేశం తదితరులు పాల్గొన్నారు. వివిధ గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద

# జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

సంగారెడ్డి, ట్రైనెట్ న్యూస్ సెప్టెంబరు 4:










సంగారెడ్డి పట్టణంలోని ఓల్డ్ బస్టాండ్ సమీపంలోని రామ్‌నగర్ రామ్ మందిర్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో జగ్గారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని రామ్ మందిర్ పరిసరాల్లో భక్తిశ్రద్ధలతో భజన కార్యక్రమాలు నిర్వహించారు. జగ్గారెడ్డి స్వయంగా భజనలు చేస్తూ భక్తులతో కలిసి ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం ఆలయంలోని శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊయలలో ఉంచి నిర్వహించిన డోలారోహణం కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.తర్వాత రామ్ మందిర్ పురవీధుల్లో భజనలు, కోలాటాలతో 12 ఉట్టి కుండలతో ప్రత్యేక ఊరేగింపు నిర్వహించారు. భక్తుల సందడి మధ్య సాగిన ఊరేగింపు అనంతరం రామ్ మందిర్ కమాన్ వద్ద సంప్రదాయబద్ధంగా ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. జగ్గారెడ్డి స్వయంగా ఉట్టి కొట్టి భక్తులనుఉత్సాహపరిచారు.ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి, జగ్గారెడ్డి కుమార్తె జయారెడ్డి, కుమారుడు భరత్ సాయి రెడ్డి పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై శ్రీకృష్ణుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తి గీతాలు, భజనలు, కోలాటాలు, ఉట్టి కొట్టే కార్యక్రమాలతో రామ్‌నగర్ రామ్ మందిర్ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

# వివిధ రాష్ట్రాలలో శ్రీకృష్ణ అష్టమి జన్మదిన శుభాకాంక్షలు జరుపుకుంటున్న వారికి శుభాకాంక్షలు తెలిపిన ఉమ్మడి జిల్లా అధ్యక్షులు లావుడియా పల్లవి రాజు నాయక్.

హనుమకొండ ట్రైనెట్ న్యూస్ సెప్టెంబరు 4:
వివిధ రాష్ట్రాల్లో చిన్న పిల్లలతో శ్రీకృష్ణ అష్టమి జన్మదిన వేడుకలలో వారి వారి పిల్లల ఆనందాల కోసం పిల్లలకు శ్రీకృష్ణుని వేషం వేయించి వారి ఆనందల కోసం జరుపుకుంటున్న కుటుంబ సభ్యులకు ముఖ్యంగా రాజస్థాన్ లో జరుపుకుంటున్న కేతావత్ మాధవి సందీప్ కుమార్తె రిహశ్రీ కి మరియు వాంకుడోత్ స్వర్ణ వినోద్ కుమార్తె స్వస్తిక మిల్కు రాజేశ్వరి బాలాజీ కుమార్తె బాబు సోనీ బబ్లు మరియు నందని అరవింద్ గారి కుమార్తె సోనీ బాయి కి మౌనిక మురళి కుమారుడు అర్జున్ రాథోడ్ కి, వసంత వెంకట్ ఇద్దరు కుమార్తెలు కుమారుడు లక్కీ మరియు సుమ ప్రసాద్ ఇద్దరు కుమారులకు ట్రింకిల్, సోను, దీపిక రాజేష్ కుమారుడు లక్కీకి వివిధ గ్రామాలలో శ్రీకృష్ణుని వేషధారణలో జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రతి కుటుంబ సభ్యులకు నా తరఫున శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు
అసత్యంపై సత్యం, అధర్మంపై ధర్మం విజయం సాధించాలనే సందేశాన్ని అందించిన శ్రీకృష్ణ పరమాత్ముని జన్మదినమైన పవిత్ర శ్రీకృష్ణాష్టమి సందర్భంగా...శ్రీకృష్ణుని వేణుగానంలా
మన జీవితాల్లో సంతోషం వెల్లివిరియాలని,ఆయన



చిరునవ్వులామన హృదయాల్లో ప్రేమ నిండాలని,గోవిందుని ఆశీస్సులతోప్రతి కుటుంబంలో ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం, శాంతిఎల్లప్పుడూ నెలకొనాలని కోరుకుంటూ...ధర్మమార్గంలో నడిచే ధైర్యాన్ని,కష్టాలను ఎదుర్కొనే శక్తిని,విజయాన్ని అందించే జ్ఞానాన్నిశ్రీకృష్ణ పరమాత్మ ప్రసాదించాలి.మీకు, మీ కుటుంబ సభ్యులందరికీ శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు శుభాకాంక్షలతోలావుడియా పల్లవి రాజు నాయక్‌లంబాడీల ఐక్యవేదిక లైవ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు మరియు రాష్ట్రట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్

## మందుగుండు అపరిమితంగా ఉంది: ట్రంప్

వాషింగ్టన్, దుబాయ్: యుద్ధం వల్ల అమెరికా వద్ద మందుగుండు సామగ్రి తరిగిపోతోందంటూ వస్తున్న వార్తలను ఆ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొట్టిపారేశారు. తాము భారీగా యుద్ధ సామగ్రిని సమకూర్చుకుంటున్నట్లు తెలిపారు. "ఇరాన్‌తో యుద్ధంలో వాడేందుకు మా వద్ద నిజానికి అపరిమిత స్థాయిలో మందుగుండు సామగ్రి ఉంది. ఇదే కాదు.. ఒకవేళ ఇంకేదైనా యుద్ధం వచ్చినా కూడా ఆ నిల్వలు మాకు సరిపోతాయి. కానీ ఇంకో యుద్ధం వచ్చే అవకాశాలు చాలా తక్కువ" అని ట్రూత్ సోషల్‌లో ట్రంప్ గురువారం పోస్టు పెట్టారు. మరోవైపు– అమెరికా తమపై ఈ వారం ప్రారంభంలో చేసిన దాడులకు ప్రతీకారం తీర్చుకునే ప్రయత్నాలను ఇరాన్ కొనసాగిస్తోంది. వాషింగ్టన్ మిత్రదేశమైన కువైట్‌పైకి గురువారం అది క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించింది. వాటిని కువైట్‌లోని గగనతల రక్షణ వ్యవస్థలు కూల్చివేసినట్లు సమాచారం.

# సంగారెడ్డిలో బీఆర్ఎస్ ఫ్లెక్సీల చింపివేత.. పోలీసులకు ఫిర్యాదు

**సీసీటీవీ ఫుటేజీ పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

సంగారెడ్డి, ట్రైనెట్ న్యూస్ సెప్టెంబరు 4:



సంగారెడ్డి పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బ్యానర్లను గుర్తుతెలియని వ్యక్తులు చింపివేసి ధ్వంసం చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు బీఆర్ఎస్ నాయకుడు, సంగారెడ్డి పట్టణం వార్డు నంబర్ 1 మాజీ కౌన్సిలర్ కాశిని శ్రీకాంత్ సంగారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు ఫిర్యాదు చేశారు.
ఫిర్యాదు ప్రకారం.. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు సంగారెడ్డి పట్టణంలో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకు పలు ప్రాంతాల్లో ఫ్లెక్సీ బ్యానర్లను ఏర్పాటు చేశారు.అయితే గుర్తుతెలియని వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా ఈ ఫ్లెక్సీలను చింపివేసి ధ్వంసం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎంఎల్‌ఏ క్యాంప్ కార్యాలయం ఎదుట, ఐబీ, సీఎస్‌ఐ చర్చి ఎదుట, తెలంగాణ తల్లి విగ్రహం వద్ద, సర్వాయి పాపన్న విగ్రహం సమీపంలో ఈ ఘటనలు చోటుచేసుకున్నట్లు తెలిపారు.రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలను శాంతియుతంగా ప్రజలకు తెలియజేసే ప్రజాస్వామ్య హక్కును గౌరవించాల్సిన అవసరం ఉందని శ్రీకాంత్ పేర్కొన్నారు. ఫ్లెక్సీల ధ్వంసానికి పాల్పడిన వారిని గుర్తించేందుకు ఆయా ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని, పట్టణంలో రాజకీయ కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు

## బీబీఎం హైస్కూల్‌లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ట్రైనెట్ న్యూస్ సెప్టెంబరు 4:







బీబీఎం హైస్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధా వేషధారణల్లో పాల్గొని అలరించారు. చిన్నారుల నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడంతో పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ గోపాల్‌రావు మాట్లాడుతూ శ్రీకృష్ణుడి జీవితం, బోధనలు విద్యార్థులకు స్ఫూర్తిదాయకమన్నారు. విద్యార్థుల్లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక విలువలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.కార్యక్రమంలో డైరెక్టర్ కాంతారావు, కరస్పాండెంట్ నాగమణి, ప్రిన్సిపల్ గోపాల్‌రావు, వైస్ ప్రిన్సిపల్ మౌనిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మక్తల్ లో. ఇండ్ల మధ్యన మురుగునీటి. సమస్య...



ట్రైనెట్ న్యూస్ సెప్టెంబరు 4:
నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం.7 వార్డును రెండు భాగాలుగా చూస్తే
ఒక ప్రాంతం రోడ్లు డ్రైనేజీల ఏర్పాటుతో దినదినాభివృద్ధి కనిపిస్తున్నది.ఇక రెండవ ప్రాంతాన్ని చూస్తే అభివృద్ధి పూర్తి శూన్యం.నిశితంగా పరిశీలిస్తే ఏడవ వార్డు విషయమై గతంలో గెలిచిన కౌన్సిలర్ , ప్రస్తుతం గెలిచిన కౌన్సిలర్ ఇద్దరూ కూడా ఒక ప్రాంతాన్ని మాత్రమే అభివృద్ధి చేయాలని కంకణం కట్టుకున్నట్లనిపిస్తుంది.కేవలం మూడు రోడ్లు తప్పా మరే ఇతర అభివృద్ధి కార్యక్రమము ఏడవ వార్డులో ఒక భాగమైన ఈ కాలనీలో జరగలేదు.ఆ మూడు రోడ్ల ఏర్పాటు వెంబడి కూడా రాజకీయ వ్యక్తిగత లబ్ది తప్పా కాలనీవాసుల సంక్షేమం లేదనే ఆరోపణలు ఉన్నాయి.కావున అభివృద్ధిలో ఎలాంటి పక్షపాతం లేకుండా ఈ కాలనీలో కూడా రోడ్లు , డ్రైనేజీల నిర్మాణం వెంటనే చేపట్టాలని కాలనీవాసులకు రోడ్డు ఇబ్బంది విషయంలో ఇంకా తీవ్రమైన డ్రైనేజీ ఇబ్బందుల నుండి విముక్తి

# కుటుంబ కలహాన్ని పరిష్కరించేందుకు వెళ్లిన బ్లూకోల్ట్ సిబ్బందిపై దాడి

## నిందితుడి అరెస్ట్

**తొర్రూరు, త్రినెట్ న్యూస్ సెప్టెంబరు 4:** భార్యాభర్తల మధ్య జరుగుతున్న కుటుంబ కలహాన్నిపరిష్కరించేందుకు వెళ్లిన బ్లూకోల్ట్ కానిస్టేబుల్‌పై ఓ వ్యక్తి కత్తి, ఇనుప రాడ్లతో దాడి చేసిన ఘటన తొర్రూరు పట్టణంలోని 14వ వార్డులో కలకలం రేపింది. కత్తిపోటుతో తీవ్రంగా గాయపడిన కానిస్టేబుల్‌కు ఆసుపత్రిలో చికిత్స అందించి ఆరు కుట్లు వేసినట్లు సమాచారం.

వివరాల్లోకి వెళ్తే.. గురువారం రాత్రి తొర్రూరు పట్టణంలోని గంగోత్రి వాటర్ ప్లాంట్ ఎదురుగా భార్యాభర్తలు గొడవ పడుతున్నారంటూ మహిళ డయల్-112కు ఫిర్యాదు చేసింది. దీంతో తొర్రూరు పోలీస్‌స్టేషన్‌లో బ్లూకోల్ట్స్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ జాటోత్ రామచంద్ర రాత్రి సుమారు 11.20 గంటలకు సంఘటనా స్థలానికి చేరుకున్నారు.గొడవకు సంబంధించిన వివరాలు



తెలుసుకునే క్రమంలో అక్కడ ఉన్న దంతాలపల్లి మండలం ఆగపేట తూర్పు తండాకు చెందిన గూగుల్ కోటేశ్వర్ కానిస్టేబుల్ రామచంద్రను అసభ్య పదజాలంతో దూషిస్తూ ఒక్కసారిగా కత్తితో దాడి చేసినట్లు తెలుస్తోంది. ఈ దాడిలో రామచంద్ర ఎడమ చంక భాగంలో, గుండె సమీపంలో కత్తిపోటుకు గురై తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం నిందితుడు ఇనుప రాడ్లతోనూ దాడి చేసినట్లు సమాచారం. దాడిలో గాయపడిన కానిస్టేబుల్ మరో పోలీస్ సిబ్బందికి సమాచారం అందించడంతో పెట్రోలింగ్ వాహనంలో ఆయనను వెంటనే సాయి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించి గాయానికి ఆరు కుట్లు వేసినట్లు సమాచారం. ప్రస్తుతం రామచంద్ర వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు.కాగా, ఘటనకు పాల్పడిన కోటేశ్వర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం నిందితుడిని తదుపరి చర్యల నిమిత్తం తొర్రూరు కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఘటనకు దారితీసిన పూర్తి కారణాలు, ఇతర వివరాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# తామరపల్లి గ్రామస్తుల విన్నపం.. మా కష్టాలు గుర్తించండి

**పోలవరం జిల్లా త్రినెట్ న్యూస్ సెప్టెంబరు 4:** రంపచోడవరం మండలం తామరపల్లి పంచాయతీ ప్రజలు రోడ్డు సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తామరపల్లి నుంచి ఈతలపాడు వరకు ఉన్న రోడ్డు పూర్తిగా దెబ్బతినింది. పెద్ద పెద్ద గుంతలు, రాళ్లు తేలిన ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. ప్రమాదాలు కూడా తరచుగాజరుగుతున్నాయి.

ఈ రోడ్డు పంచాయతీ కేంద్రానికి ప్రధాన రహదారి. ప్రజలే కాకుండా ) సచివాలయం సిబ్బంది కూడా ఈ రోడ్డు ద్వారానే ప్రయాణించాలి. పనుల నిమిత్తం సచివాలయానికి వెళ్లే ప్రజలు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు.తామరపల్లి పరిసర ప్రాంతాల్లో



సుమారు 200 ఎకరాలలో వ్యవసాయం సాగు చేస్తున్నారు. ఎరువులు సరఫరా చేయడానికి, అలాగే పండించిన పంటను ఆర్బికే ద్వారా తరలించడానికి ఈ రోడ్డు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఈ రోడ్డుపై ప్రయాణం అసాధ్యంగా మారుతుంది. దీనివల్ల రైతులకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతుంది.గ్రామస్తులు గతంలో ఎన్నోసార్లు గ్రీవెన్స్ డే లో దరఖాస్తు చేసుకున్నారు, కానీ ఫలితం లేదు. స్థానిక ఎమ్మెల్యే కి కూడా ఈ సమస్య గురించి విన్నవించినప్పటికీ, కేవలం హామీలు మాత్రమే లభిస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కొన్ని నెలల క్రితం జిల్లా కలెక్టర్ శ్రీ దినేష్ కుమార్ మా తామరపల్లి పంచాయతీకివచ్చినప్పుడు ప్రజల కష్టాలు విన్నారు. ఆయన కూడా రోడ్డు సమస్య పరిష్కారం కోసం తన వాగ్దానాన్ని ఇచ్చారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

తామరపల్లి ప్రజల కష్టాలను, ఇబ్బందులను అర్థం చేసుకుని, మాకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుకుంటున్నరు.

# ఆరు గ్యారంటీలు గాలికి.. 420 హామీలు బోగస్

**చిలుకూరు, త్రినెట్ న్యూస్ సెప్టెంబరు 4:** చిలుకూరు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్రంగా విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా చిలుకూరు మండలం బేతవోలు గ్రామంలో వృద్ధులు, మహిళలు, దివ్యాంగులతో సదస్సు, వంటా-వార్పు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బొల్లం మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో వృద్ధులు, వితంతువులకు రూ.4 వేల పింఛన్, దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్, మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం, విద్యార్థినులకు స్కూటర్లు వంటి హామీలు ఇచ్చి



అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వృద్ధులు, దివ్యాంగులు,వితంతువులకు పింఛన్లు సకాలంలో అందించామని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం సదరం క్యాంపులు సక్రమంగానిర్వహించకపోవడంతో దివ్యాంగులు ఇబ్బందులుపడుతున్నారనిసర్టిఫికెట్ల కోసందళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు లేకుండా పనులు జరగడం లేదని ఆరోపించారు.కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిరంతర విద్యుత్, సాగునీటితో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇచ్చామని, ప్రస్తుతం విద్యుత్ కోతలు, సాగునీటి సమస్యలతో రైతులు ఇబ్బందులుపడుతున్నారని మల్లయ్య యాదవ్ పేర్కొన్నారు. గురుకులాల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో పాటు నాణ్యతలేని ఆహారం కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు.ప్రజా సమస్యలను పట్టించుకోకుండా పాలకులు హెలికాప్టర్లలో తిరుగుతూ, అప్పులు చేస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగంచేస్తున్నారని ఆయన ఆరోపించారు. తనకు పదవి ఉన్నా లేకపోయినా బడుగు, బలహీన వర్గాల ప్రజల హక్కుల కోసం బీఆర్ఎస్ గులాబీ జెండా నీడన నిరంతరం పోరాడుతానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జానకిరామాచారి, మాజీ సర్పంచ్ తాలూరి శ్రీనివాస్, చిలుకూరు పీఏసీఎస్ చైర్మన్ జనార్దన్, మాజీ జెడ్పీటీసీ శివాజీ నాయక్, గిద్దె రాజేష్, శ్రీనివాస్, వాసు, వీరయ్య నిగిడాల తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**చిలుకూరు, త్రినెట్ న్యూస్ సెప్టెంబరు 4:** చిలుకూరు మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రం--4 లో కృష్ణాష్టమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు.ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ సిరికొండ కవిత మాట్లాడుతూ..చిన్నారులకు బాల్యదశ నుంచే మన పురాణ



గాథలు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గురించి తెలియజేయడం ఎంతో అవసరమన్నారు. పురాణాల్లోని మంచి సందేశాలను చిన్నారులకు పరిచయం చేసి, వాటిని జీవితంలో అనుసరించేలా ప్రోత్సహిస్తే భవిష్యత్తులో వారు సన్మార్గంలో పయనించే అవకాశం ఉంటుందని తెలిపారు.

వేడుకల సందర్భంగా చిన్నారుల వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## నారాయణపురం, పాలేఅన్నారంలో ఘనంగా ముత్యాలమ్మ--పోతరాజు విగ్రహ ప్రతిష్ఠ

**చిలుకూరు: త్రినెట్ న్యూస్ సెప్టెంబరు 4:** చిలుకూరు మండలం: నారాయణపురం, పాలేఅన్నారం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన ఆలయాల్లో శ్రీ ముత్యాలమ్మ, పోతరాజు విగ్రహ ప్రతిష్ఠాకార్యక్రమాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ



సందర్భంగా అమ్మవార్లకు పట్టు వస్త్రాలు, పూలమాలలు సమర్పించి ప్రత్యేక అలంకరణ చేశారు. పురోహితులు వెంకటరమణ శాస్త్రి ఆధ్వర్యంలోవేదమంత్రోచ్చారణల మధ్య నూతన విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులుచెల్లించుకున్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మండవజయమ్మ--వెంకటేశ్వర్లు, దేవాలయ స్థలదాత దేవరం సైదిరెడ్డి, తమ్మనబోయిన శంకర్, గంధ్ర లింగస్వామి, బూర వెంకటనారాయణ, కీసర నాగరాజు, మేకల కొండలరావు, బూర లక్ష్మినారాయణ, బైరు రాంబాబు, దేశబోయిన జానకిరాములు, సూరగని కిరణ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండండి - దేవీపట్నంలో బీజేపీ కార్యవర్గ భేటీ

**దేవీపట్నం, త్రినెట్ న్యూస్ సెప్టెంబరు 4:** దేవీపట్నం మండల కేంద్రం ఇందుకూరుపేటలో బీజేపీ విస్తృత స్థాయి సమావేశం మండల అధ్యక్షుడు కారం రామన్న దొర అధ్యక్షతన జరిగింది.ఈ భేటీకి పోలవరం జిల్లా ఇన్చార్జ్ గాదె శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు ఈకా బుల్లి కొండల దొర, మాజీ ఎమ్మెల్యే కోసూరి సత్యనారాయణ రెడ్డి, రాష్ట్ర నాయకులు సప్ప కుమారి, కుంజం



స త్య నా రా య ణ వ మ్మ హాజరయ్యారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి తరఫున సత్తా చాటాలని, పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలని జిల్లా ఇన్చార్జ్ శ్రీనివాస్ సూచించారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు మోదీ 25



ఏళ్ల పాలన పురస్కరించుకుని నిర్వహించే 'సేవా సంకల్ప ఉత్సవాల' కార్యాచరణపై జిల్లా అధ్యక్షుడు దిశానిర్దేశం చేశారు.సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి అయినాలవెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పడమట లక్ష్మణరావు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**చిలుకూరు, త్రినెట్ న్యూస్ సెప్టెంబరు 4:** చిలుకూరు మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రం--4 లో కృష్ణాష్టమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు.ఈ



సందర్భంగా అంగన్వాడీ టీచర్ సిరికొండ కవిత మాట్లాడుతూ..చిన్నారులకు బాల్యదశ నుంచే మన పురాణ గాథలు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గురించి తెలియజేయడం ఎంతో అవసరమన్నారు. పురాణాల్లోని మంచి సందేశాలను చిన్నారులకు పరిచయం చేసి, వాటిని జీవితంలో అనుసరించేలా ప్రోత్సహిస్తే భవిష్యత్తులో వారు సన్మార్గంలో పయనించే అవకాశం ఉంటుందని తెలిపారు.

వేడుకల సందర్భంగా చిన్నారుల వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# మిట్టకందల గ్రామంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**నంద్యాల జిల్లా త్రినెట్ న్యూస్ సెప్టెంబరు 4:** పాములపాడు:-పాములపాడు మండలంలోని, మిట్టకందాల గ్రామంలో యాదవ్ సంఘం ఆధ్వర్యంలో శ్రీ రుక్మిణి రాధాకృష్ణ శ్రీ కృష్ణాష్టమి వేడుకలో అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మాజీ సర్పంచ్ జి.హరిప్రసాద్ యాదవ్ అందరికీ కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలియజేసి, అందరూ గ్రామంలో సుఖ సంతోషాలతో, అన్నదమ్ములుగా కలిసి వెలిసి ఆదర్శంగా జీవించాలన్నారు. ఆ దేవుడి దయవల్ల ఇప్పటికైనా మంచి వర్షాలు కురిసి రైతులు పాడి పంటలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## సాగర్ కాలువకు గండి.. పొలాల్లోకి వరద నీరు



**చిలుకూరు, త్రినెట్ న్యూస్ సెప్టెంబరు 4:** చిలుకూరు సాగర్ మేజర్ ఎడమ కాలువకు గుర్తు తెలియని వ్యక్తులు గండి పెట్టడంతో సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం కరకాయిలగూడెం పరిధిలో పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. భారీగా నీరు పొలాల్లోకి దూసుకెళ్లడంతో చేతికొచ్చిన పంటలు నీట మునిగి రైతులు ఆందోళన చెందుతున్నారు.గండి పడి గంటలు గడుస్తున్నా అధికారులు స్పందించకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీరు అంతకంతకూ చేరుతుండటంతో నష్టం పెరిగే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీటిపారుదల శాఖ మంత్రి ఇలాకాలోనే ఇలా జరగడం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై విమర్శలు వస్తున్నాయి. వెంటనే గండిని పూడ్చి, పంట నష్టాన్ని అంచనా వేసి గండి పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## వేలేరులో సర్పంచ్‌పై ఆరోపణలు - సొంత పనులకు పంచాయతీ కార్మికులా



**వేలేరు / హనుమకొండ, త్రినెట్ న్యూస్ సెప్టెంబరు 4:** గ్రామ పారిశుద్ధ్య కార్మికులను సర్పంచ్ తన సొంత పనులకు వాడుకుంటున్నారని వేలేరు గ్రామస్థులుఆరోపిస్తున్నారు.

వాటర్ ప్లాంట్ నుంచి ఇంటికి నీళ్లు తెప్పించడం, సొంత వెంచర్‌లో మొక్కలకు నీళ్లు పోయించడం, కొడుకును స్కూల్లో దింపడం వంటి పనులకు కార్మికులను వాడుతున్నారని, అలాగే తల్లిదండ్రులు, అన్నా వదినల ఇళ్ల ముందు ఊడ్పించి ముగ్గులు వేయిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

సర్పంచ్ కు ఎదురు చెప్పలేక కార్మికులు ఇబ్బంది పడుతున్నారని, ప్రశ్నించిన వారిని సంక్షేమ పథకాలు రాకుండా చేస్తానని బెదిరిస్తున్నారని గ్రామస్థులు అంటున్నారు.

ఈ ఆరోపణలపై ఎంపీడీవో, డీపీవో, కలెక్టర్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

## వాయిలసింగవరంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**అనంతగిరి, త్రినెట్ న్యూస్ సెప్టెంబరు 4:** అనంతగిరి మండలం వాయిలసింగవరం గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది.మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముసుకు శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు లబ్ధిదారులకు నూతన కార్డులు అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని, అర్హులందరికీ పథకాలు పారదర్శకంగా అందేందుకే స్మార్ట్ కార్డులు తెచ్చిందని తెలిపారు.

# 1000 రోజుల ప్రజా పాలన: మల్కాజ్‌గిరిలో కాంగ్రెస్ భారీ బైక్ ర్యాలీ



## ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం: డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రెష్ యాదవ్

ట్రైనెట్ న్యూస్ సెప్టెంబరు 4:
తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మల్కాజ్‌గిరి కార్పొరేషన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. రాంపల్లి చౌరస్తా నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ జవహర్ నగర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ఈ కార్యక్రమానికి మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జవహర్ నగర్ వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు.

### తోటకూర వజ్రెష్ యాదవ్ ముఖ్యమైన వ్యాఖ్యలు:

సంక్షేమానికి పెద్దపీట: ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమం, అభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. హామీల అమలు: ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ప్రత్యక్ష ప్రయోజనాలు: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం (మహాలక్ష్మి), గృహజ్యోతి పథకాల ద్వారా లక్షలాది కుటుంబాలకు లబ్ధి చేకూరుతోందని గుర్తుచేశారు. ఇందిరమ్మ ఇళ్లు: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ల ద్వారా సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. మౌలిక వసతుల కల్పన: గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో పెండింగ్‌లో పడ్డ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తూ మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నామని తెలిపారు. కార్యకర్తలకు పిలుపు: ప్రభుత్వ 1000 రోజుల విజయాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని, ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. మల్కాజ్‌గిరి కార్పొరేషన్ పరిధిలోని నాగారం, దమ్మాయిగూడ, కీసర, చంద్రపురి కాలనీ, జవహర్ నగర్ డివిజన్లకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు యువత ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.






# ఖర్గేను గౌరవించే రాహుల్‌గాంధీ.. బంగారు లక్ష్మణ్‌ను బీజేపీ అవమానించింది: జగ్గారెడ్డి

ట్రైనెట్ న్యూస్ సెప్టెంబరు 4:
దళిత నాయకులను గౌరవించే విషయంలో కాంగ్రెస్, బీజేపీల మధ్య స్పష్టమైన తేడా ఉందని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ ఎంతో గౌరవిస్తారని పేర్కొన్నారు. ఉత్తరాఖండ్‌లో జరిగిన ఓ సభ అనంతరం సభా ప్రాంగణాన్ని బీజేపీ అనుబంధ నాయకులు శుభ్రం చేసిన అంశాన్ని ప్రస్తావిస్తూ జగ్గారెడ్డి వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బీజేపీ, దాని అనుబంధ సంస్థలు తమ నాయకులకు సూచనలు చేయాలని అన్నారు. ఖర్గే రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడితో పాటు దళిత నాయకుడని, ఆయనను అవమానించడం సరికాదని పేర్కొన్నారు. ఈ అంశంపైనే రాహుల్‌గాంధీ ప్రశ్నించారని, అయితే ఆయన చేసిన వ్యాఖ్యలను బీజేపీ కావాలనే




వక్రీకరించి ప్రచారం చేస్తోందని జగ్గారెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్‌లో ఎస్సీ, ఎస్టీ అనే వివక్ష భావన లేదని, రాహుల్‌గాంధీ ఖర్గేతో కలిసి నడవాల్సిన సందర్భాల్లో ఆయన చేయి పట్టుకుని నడుస్తారని అన్నారు. అదే సమయంలో తెలంగాణకు చెందిన మాజీ బీజేపీ జాతీయ అధ్యక్షుడు, దళిత నాయకుడు బంగారు లక్ష్మణ్ విషయంలో బీజేపీ వ్యవహరించిన తీరును జగ్గారెడ్డి ప్రస్తావించారు. బంగారు లక్ష్మణ్‌ను జాతీయ అధ్యక్షుడిగా నియమించిన అనంతరం స్టింగ్ ఆపరేషన్ ద్వారా పార్టీ నిధుల వ్యవహారాన్ని తెరపైకి తెచ్చి, ఆయనను పదవి నుంచి తొలగించారని విమర్శించారు. "బంగారు లక్ష్మణ్ జాతీయ అధ్యక్షుడిగా ఉండటం ఇష్టం లేకే ఆయనను పదవి నుంచి దించేందుకు కుట్ర చేశారని" జగ్గారెడ్డి ఆరోపించారు. ఇలాంటి ఆలోచన కాంగ్రెస్ పార్టీకి, రాహుల్‌గాంధీ కుటుంబానికి లేదని అన్నారు. బీజేపీ అహంకారంతో వ్యవహరిస్తోందని, తమకు వ్యతిరేకంగా మాట్లాడేవారిపై విమర్శలు చేస్తోందని జగ్గారెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ దళిత నాయకత్వాన్ని గౌరవిస్తుందని, ఖర్గేకు పార్టీ నాయకత్వంలో సముచిత గౌరవం కల్పించిందని పేర్కొన్నారు. బీజేపీ రాహుల్‌గాంధీని దళిత వ్యతిరేకిగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తోందని, అది వాస్తవం కాదని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

# విజయం కంటే వైఫల్యమే ఎక్కువ నేర్పిస్తుంది










## గీతం హైదరాబాద్ టెడ్ఎక్స్ లో అతిథుల ఉద్వాటన.

ట్రైనెట్ న్యూస్ సెప్టెంబరు 4:
హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 4న నిర్వహించిన స్వతంత్ర టెడ్ఎక్స్ కార్యక్రమం స్ఫూర్తిదాయకమైన ఆలోచనలు, కథల ద్వారా 'స్థైర్యం, ఎదుగుదలను' చాటిచెప్పింది. విజయం కంటే వైఫల్యమే జీవితానుభవాలను నేర్పిస్తుంది స్పష్టీకరించింది. దాదాపు వంద మంది ఔత్సాహిక విద్యార్థులను ఒకచోట చేర్చి, వారిలో సవాళ్లను స్వీకరించి, పరిష్కరించగలిగే స్ఫూర్తిని నింపింది. ఈ కార్యక్రమంలో సవాళ్లను ఎదుర్కోవడం, మార్పును స్వీకరించడం, అర్థవంతమైన వ్యక్తిగత, వృత్తిపరమైన ఎదుగుదలను సాధించడం వంటి అంశాలపై విభిన్న స్వరాలు, దృక్కోణాలు వెల్లడయ్యాయి. ప్రముఖ వక్తలలో భారత వైమానిక దళ మాజీ అధికారి, నాయకత్వ నిపుణుడు ఎయిర్ మార్షల్ నానేశ్వర్ తివారీ; ప్రఖ్యాత చిత్ర నిర్మాత, కథకురాలు బి.వి. నందిని రెడ్డి; ఇమేజ్ కన్సల్టెన్సీ వ్యవస్థాపకురాలు, ముఖ్య కార్యనిర్వహణాధికారి, పర్సనల్ బ్రాండింగ్, సాఫ్ట్ స్కిల్స్ నిపుణురాలు మిహికా భానోత్ ఉన్నారు. తమ వ్యక్తిగత అనుభవాలు, వృత్తిపరమైన అంతర్దృష్టుల ద్వారా, వక్తలు స్థైర్యాన్ని కేవలం ప్రతికూలతలను అధిగమించే సామర్థ్యం కంటే ఎక్కువగానే అన్వేషించారు. దానిని అనుకూలత, నిరంతర అభ్యాసం, పరివర్తనతో కూడిన ఒక మనస్తత్వంగా ప్రదర్శించారు. ఎయిర్ మార్షల్ నానేశ్వర్ తివారీ దృఢమైన, క్రమశిక్షణ కలిగిన మనస్సు యొక్క శక్తిని నొక్కి చెప్పారు. తమ సౌకర్యవంతమైన పరిధిని దాటి, కొత్త విషయాలను స్వీకరించమని ఆయన ప్రోత్సహించారు. ఒక టెస్ట్ పైలట్‌గా తన అనుభవాల నుంచి ఉదహరిస్తూ, సవాళ్లను స్వీకరించడం, కొత్త అవకాశాలను అన్వేషించడం, ప్రతి వ్యక్తి ఒక అర్థవంతమైన సహకారాన్ని అందించగలడని నమ్మడం యొక్క ప్రాముఖ్యతను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. సంతృప్తికరమైన జీవితానికి ఆరోగ్యం, ఆనందం అనేవి ముఖ్యమైన అంశాలని తివారీ స్పష్టీకరించారు. చిత్ర నిర్మాత బి.వి. నందిని రెడ్డి, తన కళాశాల రోజుల నుంచి విజయవంతమైన చిత్ర దర్శకురాలిగా మారే వరకు తన ప్రయాణాన్ని పంచుకున్నారు. ఈ ప్రయాణంలో తాను ఎదుర్కొన్న అడ్డంకులు, వైఫల్యాలు, అనిశ్చితులను ఆమె గుర్తుచేసుకున్నారు. వైఫల్యం నుంచి పాఠాలు నేర్చుకోవాలని, గందరగోళానికి సిద్ధంగా ఉండాలని ఇతరుల సలహాల నుంచి ఉపయోగపడే వాటిని మాత్రమే తీసుకోవాలని ఆమె యువతను కోరారు. 'మీ విజయం కంటే ఒక వైఫల్యం మీకు చాలా ఎక్కువ నేర్పిస్తుంది' అని ఆమె అన్నారు. ఆత్మవిశ్వాసంతో, లక్ష్యంతో ముందుకు సాగమని ఆమె యువతనుప్రోత్సహించారు. స్థైర్యం, సానుభూతి, భయం ఉన్నప్పటికీ, పనిచేసే ధైర్యం గురించి మిహికా భానోత్ మాట్లాడారు. సరైన సమయం కోసం వేచి ఉండకుండా, వెంటనే ప్రారంభించాలని, తమ నిర్ణయాలకు బాధ్యత వహించాలని, పట్టిన పట్టు ఎప్పటికీ విడవొద్దని ఆమె సూచించారు. విద్యార్థుల నేతృత్వంలోని కార్యక్రమంగా, టెడ్ఎక్స్ గీతం హైదరాబాద్ విద్యార్థులకు నాయకత్వం, జట్టుకృషి, భావప్రసారం, కార్యక్రమ నిర్వహణ, భాగస్వామ్యం వంటి అంశాలలో ప్రత్యక్ష అనుభవాన్ని అందించింది. ఈ ఆలోచనలు, ఉద్బోధలు ప్రాంగణ పరిధిని దాటి విస్తరించేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. 'వ్యాప్తి చేయదగిన ఆలోచనలు' అనే టెడ్ యొక్క లక్ష్యానికి అనుగుణంగా, టెడ్ఎక్స్ గీతం హైదరాబాద్ అర్థవంతమైన సంభాషణలను, సరికొత్త దృక్కోణాలకు ఒక వేదికను సృష్టించింది. ఇందులో పాల్గొన్నవారిని సవాళ్లను స్వీకరించడానికి, అనుభవం నుంచి నేర్చుకోవడానికి, నిరంతర అభివృద్ధిని సాధించడానికి ప్రేరేపించింది.

## మీ పిల్లలకు ఇలాంటి భోజనమే పెడతారా..? ఎమ్మెల్యే ఆగ్రహం

అనపర్తి గ్రామీణం: విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమాడితే సహించేది లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హెచ్చరించారు. అనపర్తి మండలం లక్ష్మీ నరసాపురంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని వసతి గృహం, భోజనశాలను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యతను చూసి ఎమ్మెల్యే తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పాడైన కూరగాయలను చూసి మండిపడ్డారు. వారాకొకసారి ఆదివారం అందించాల్సిన చికెన్ భోజనాన్ని కూడా విద్యార్థులకు పెట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం వండిన భోజనాన్ని రాత్రిపూట కూడా పెడుతున్నారని, ఆ అన్నం కూడా సరిగ్గా ఉడకపోవడంతో విద్యార్థులు చెత్త బుట్టల్లో పారేస్తున్నారని, తీరు మార్చకపోతే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు.
మరోవైపు కూరగాయల స్టాక్ రిజిస్టర్, రికార్డు బుక్ నిర్వహించకపోవడంపై వార్డెన్‌ను నిలదీశారు. స్టాక్ బుక్ ఎక్కడ ఉందంటూ వార్డెన్‌ను ప్రశ్నించగా, బుక్ సంక్షేమ శాఖ కార్యాలయంలో ఉందని ఒకసారి, తన ఇంటి వద్ద ఉందని మరోసారి సమాధానం చెప్పడంతో ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్ సెలవులో ఉండటంతో ఆయనతో ఫోన్‌లో మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకపోవడంపై ప్రిన్సిపల్, వార్డెన్‌పై మండిపడ్డారు. పుచ్చిపోయిన, కుళ్లిన కూరగాయలను చూపిస్తూ మీ ఇంట్లో పిల్లలకు కూడా ఇలాంటివి పెడతారా? అని ప్రశ్నించారు. సమస్యలపై మాట్లాడేందుకు కూడా విద్యార్థులు భయపడిపోతున్నారని, ఈ దారుణ పరిస్థితిపై ప్రభుత్వం, సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్‌లకు ఫిర్యాదు చేస్తానని ఎమ్మెల్యే నల్లమిల్లి స్పష్టం చేశారు.

# ఉపాధ్యాయ వృత్తి అత్యంత గౌరవప్రదం...

**ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన: మన మహతి న్యూస్ ఎండీ, సీఈఓ డాక్టర్ ప్రకాష్**

ట్రైనెట్ న్యూస్ సెప్టెంబరు 4:



సమాజంలో ఎన్నో వృత్తులు ఉన్నప్పటికీ ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైనదని, గౌరవప్రదమైనదని మన మహతి న్యూస్ ఎండీ, సీఈఓ డాక్టర్ ప్రకాష్ జాదవ్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్యులు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు, దేశాన్ని నడిపించే నాయకులను తీర్చిదిద్దే శక్తి ఉపాధ్యాయుడికే ఉందన్నారు. ఉపాధ్యాయుడు పాఠ్యాంశాలతో పాటు విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక స్పృహను పెంపొందిస్తారని తెలిపారు. అజ్ఞానమనే చీకటిని తొలగించి జ్ఞానమనే వెలుగును నింపుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే గురువును మన పెద్దలు దైవంతో సమానంగా గౌరవించారని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే నిర్మితమవుతుందని డాక్టర్ ప్రకాష్ జాదవ్ అన్నారు.

# శిల్పారామంలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

ట్రైనెట్ న్యూస్ సెప్టెంబరు 4:
శిల్పారామం మాదాపూర్ , సౌత్ సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్ నాగపూర్ వారి సంయుక్త



నిర్వహణ లో శిల్పారామం బృందావనం లో శ్రీ కృష్ణ జన్మాష్టమి ఉత్సవాలను నిర్వహించారు. మిత్రాంగం హైదరాబాద్ మహారాష్ట్ర అసోసియేషన్ అంబరీష్ లాహంకార్ నేతృత్వంలో డోల్ తాషా డ్రమ్స్ , డాక్టర్ శ్రావ్య మానస శిష్య బృందం చిన్ని చిన్ని కృష్ణులు మరియు గోపికలతో కోలాటం చేస్తూ , మధ్య ప్రదేశ్ రాజేంద్ర సింగ్ బృందం బారెడి నృత్య ప్రదర్శనలు చేస్తూ శిల్పారామం మెయిన్ లాన్ నుండి బృందావనం వరకు ఊరేగింపు నిర్వహించారు. తరువాత బృందావనం లో కోలాటం మరియు కూచిపూడి నృత్య ప్రదర్శనలు ప్రదర్శించారు. శిల్పారామం బృందావనం రంగు రంగు పూలతో , లైట్స్ తో అలంకరించారు. సందర్శకులు ఎంతో ఉత్సహం తో పాల్గొన్నారు.

# జన్మతః పౌరసత్వంపై ట్రంప్‌నకు మరో ఎదురుదెబ్బ



మేరీలాండ్: అమెరికా గడ్డపై పుట్టినవారు జన్మతః పౌరసత్వం పొందేందుకు ఉన్న హక్కును నిలిపివేయాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రయత్నానికి కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పౌరసత్వం పొందడానికే ప్రసవ సమయానికి అమెరికాకు వస్తున్నారని, ఇలాంటి 'బర్త్ టూరిజం'ను అడ్డుకోవాల్సిందేనని ట్రంప్ ఇదివరకే ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ కార్యనిర్వాహక ఉత్తర్వుపై మేరీలాండ్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి డెబోరా ఎల్ బోర్డ్‌మాన్ బుధవారం ఇంజంక్షన్ ఆర్డర్ ఇచ్చారు. వలస వచ్చిన కుటుంబాలు, ఇతర సంఘాలు దాఖలుచేసిన కేసు పరిష్కారమయ్యేవరకు ఇది అమల్లో ఉంటుందని తెలిపారు. ట్రంప్ ఇదివరకు చేసిన ప్రయత్నాన్ని జూన్‌లో సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఆగస్టులో ఆయన కొన్ని మార్పులతో మరో రూపంలో ప్రయత్నించారు. ఈ ఉత్తర్వుల్ని నిలిపివేయవద్దని ప్రభుత్వం తరఫు న్యాయవాదులు చేసిన వినతిని న్యాయమూర్తి బోర్డ్‌మాన్ తోసిపుచ్చారు. శ్వేతసౌధం స్పందన తెలియాల్సి ఉంది.

# భారత కంపెనీతో రూ.769 కోట్ల ఆయుధ డీల్.. ఎస్తోనియా రక్షణమంత్రి రాజీనామా

ఆయుధాల ఒప్పందం విషయంలో బయటపడిన అవకతవకలు ఎస్తోనియా రక్షణ మంత్రి (జుర్శీఅఖుఅ ణవటవఅఎవ వీఙఅఙర్‌వతీ) పదవికి ఎసరు తెచ్చాయి. రూ.768.50 కోట్లతో ఫిరంగి మందుగుండు సామగ్రి కొనుగోలుకు సంబంధించి తీవ్ర విమర్శలు వ్యక్తం కావడంతో హన్నో పెవ్కుర్ రాజీనామా చేశారు. ఈ డీల్‌కు సంబంధించి ఆడిట్‌లో తేలిన అక్రమాల ఆధారంగా నేర విచారణ జరగనుంది. ఈ నేపథ్యంలో హన్నో నైతిక బాధ్యత వహిస్తూ రక్షణమంత్రి పదవి నుంచి వైదొలిగారు. ఈ వివాదంలో భారత్‌కు చెందిన ఓ కంపెనీ కేంద్ర బిందువుగా మారడం గమనార్హం. రష్యాతో యుద్ధం నేపథ్యంలో ఉక్రెయిన్‌లో మందుగుండు సామగ్రి (ూాతీఅశ్రీశ్రీవతీఎఒష్ట్రవశ్రీశ్రీం) కొరత ఏర్పడింది. కీవ్ కోసం వాటిని సమీకరించేందుకు మరో ఐరోపా దేశం ఎస్తోనియా.. ఇటలీకి చెందిన డేటాసెల్ ఎస్ఆర్ఎల్ కంపెనీతో 2024లో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డేటాసెల్ కంపెనీని అదే ఏడాది ఆరంభంలో భారత్‌కు చెందిన నెకో డిఫెన్స్ కొనుగోలు చేసింది. ఈ మొత్తం ఒప్పందం విలువ 70 మిలియన్ల యూరోలు. ఐరోపా యూనియన్‌కు చెందిన యూరోపియన్ పీస్ ఫెసిలిటీ నుంచి వచ్చిన డబ్బును ఎస్తోనియా ఈ కంపెనీకి దశల వారీగా ముందుగానే చెల్లించింది. కొన్ని నెలల్లోనే ఈ మందుగుండు సామగ్రి ఉక్రెయిన్‌కు చేరుకుంటుందని అంతా భావించారు. కానీ, ఆయుధ సరఫరాలు పదేపదే ఆలస్యమయ్యాయి. 2025లో కొన్ని షెల్స్ డెలివరీ అందినా.. అవి పూర్తిగా లోపాలతో ఉన్నాయని ఎస్తోనియా ఆరోపించింది. దీంతో వాటిని ఉక్రెయిన్‌కు పంపించలేదని తెలిపింది. తాను చెల్లించిన డబ్బు తిరిగి పొందేందుకు ఎస్తోనియా ప్రయత్నాలు ప్రారంభించింది. అయితే, ఈ ఆరోపణలను డేటాసెల్ కంపెనీ తిప్పికొట్టింది. తాము చాలావరకు డెలివరీలు అందించామని, ఒప్పందం గడువు ముగియడానికి ముందే 59 మిలియన్ యూరోల విలువైన మందుగుండు సామగ్రిని సరఫరా చేశామని వెల్లడించింది. అలాగే నాణ్యతా సమస్యల కారణంగానే ఒప్పందం రద్దు చేసుకున్నారన్న వాదనలను ఖండించింది. ఈ వ్యవహారం నేపథ్యంలో ఎస్తోనియాపై డేటాసెల్ కంపెనీ దావా వేసింది.
ఈ నేపథ్యంలోనే ఎస్తోనియా రక్షణ నిధుల నిర్వహణ, సైనిక కొనుగోళ్లకు సంబంధించిన ఆడిట్ చేపట్టగా అవకతవకలు బయటపడ్డాయి. దీనిపై విమర్శలు రావడంతో రక్షణ మంత్రి రాజీనామా చేశారు. ఈ డీల్‌కు చెల్లించిన డబ్బులు ఐరోపా యూనియన్‌కు తిరిగిరాకపోతే.. ఎస్తోనియా తన సొంత బడ్జెట్ నుంచి ఆ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఎస్తోనియా దేశం ఐరోపా యూనియన్, నాటో కూటమిలో భాగం. దీనికి రష్యాతో సరిహద్దు ఉంది. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఆ దేశంలో కూడా భద్రతాపరమైన ఆందోళనలు తలెత్తాయి. అలాగే ఉక్రెయిన్‌కు ఎస్తోనియా కీలక మద్దతుదారుగా ఉంది.

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
శనివారం సెప్టెంబర్ 05, 2026
www.trinetnews.com



# 75 ఏళ్ల దౌత్య సంబంధాలకు గుర్తుగా..

## భారత్, జపాన్ మధ్య టీ20 మ్యాచ్

భారత్, జపాన్ మధ్య ఏళ్లుగా విడదీయరాని సంబంధం ఉంది. ఆ దేశానికి చెందిన ఎన్నో ప్రముఖ సంస్థలు భారత్‌లో కంపెనీలు స్థాపించి ఇక్కడి అభివృద్ధిలో భాగస్వాములయ్యాయి. భారత్, జపాన్ మధ్య 75 ఏళ్ల దౌత్య సంబంధాలకు గుర్తుగా భారత పురుషుల క్రికెట్ టీమ్ సెప్టెంబర్ 22న ఆ దేశంతో టీ20 మ్యాచ్ ఆడబోతోంది. ఇరు దేశాల్లో ఇది చరిత్రాత్మంగా నిలవనుంది. ఈ విషయాన్ని బీసీసీఐ ధ్రువీకరించింది. జపాన్‌లోని టోచిగిలో ఉన్న సానో ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఈ మ్యాచ్ నిర్వహించనున్నారు.
భారత ప్రధాని మోదీ, జపాన్ ప్రధాని సనాయె తకాయిచి మధ్య జరిగిన భేటీలో కుదిరిన ఒప్పందం ప్రకారం ఈ మ్యాచ్‌ను నిర్వహించనున్నారు. ఇరు దేశాల్లోని క్రీడలు, ప్రజల మధ్య సంబంధాలను బలోపేతం చేయడానికి చేపట్టిన 'స్పోర్ట్ 75'లో ఇది భాగమని బీసీసీఐ పేర్కొంది. ఈ నెలలోనే జపాన్ వేదికగా ఆసియా క్రీడలు ప్రారంభం కానున్నాయి. అయితే, భారత క్రికెట్ పురుషుల జట్టు బైతో నేరుగా క్వార్టర్ ఫైనల్స్ రౌండ్‌లో ఆడనుంది. జపాన్ గ్రూప్ స్టేజీలో ఆడనుంది.
భారత్, జపాన్ మధ్య జరగనున్న ఈ మ్యాచ్‌ను బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా కీలక ఘట్టంగా అభివర్ణించారు. చారిత్రక ఘట్టంలో భాగమవుతున్నందుకు బీసీసీఐకి ఆనందంగా ఉన్నట్లు తెలిపారు. ఈ మ్యాచ్ జపాన్, తూర్పు ఆసియా ప్రాంతాలకు క్రికెట్‌ను పరిచయం చేసేందుకు విస్తృత అవకాశం కల్పిస్తుందన్నారు. ప్రపంచ ఛాంపియన్‌ను తమ దేశంలోకి ఆహ్వానించడం ఒక మైలురాయి అని జపాన్ క్రికెట్ అసోసియేషన్ సీఈవో నావోకీ మియాజీ పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య కుదిరిన ఒప్పందంతో టీ20 ర్యాంకింగ్స్‌లో 41వ స్థానంలో ఉన్న జపాన్‌కు.. టీ20 ప్రపంచకప్ ఛాంపియన్‌గా నిలిచిన భారత్‌తో తలపడడం ఓ అరుదైన అవకాశంగా చెప్పవచ్చు.

# మూడున్నరేళ్లకే బ్యాట్ పట్టి..

## ఫాస్ట్‌గా టాప్ రేటింగ్ సాధించి!



ఇప్పుడంటే వైభవ్ సూర్యవంశీ తన దూకుడుతో అందరి దృష్టిలో పడ్డాడు కానీ.. ఏడాది ముందు వరకూ మరో ప్లేయర్ గురించే చర్చ జరిగేది. పొట్టి ఫార్మాట్‌లోకి అడుగు పెట్టిన కొన్నాళ్లకే అగ్రస్థానం దక్కించుకొని ఔరా అనిపించాడు. స్టైలిష్ లుక్‌తోనూ అందరి మనసులను దోచిన ఆ కుర్రాడే అభిషేక్ శర్మ . ఇవాళ ఈ యంగ్ బ్యాటర్ బర్త్‌డే.

**ఒక్క ఏడాదిలోనే..**

అభిషేక్ శర్మ ఇప్పటి వరకు 56 అంతర్జాతీయ టీ20 మ్యాచులు ఆడాడు. భారత జట్టులోకి జులై 2024లో అరంగేట్రం చేశాడు. అంటే ఇప్పటికి సరిగ్గా 27 నెలలు మాత్రమే. అప్పట్నుంచి దాదాపు ప్రతి టీ20లోనూ ఆడాడు. గతేడాది ఫిబ్రవరిలో ఇంగ్లాండ్‌పై కేవలం 54 బంతుల్లోనే 135 పరుగులు చేసి ఆశ్చర్యపరిచాడు. అదే అతడిని ఐసీసీ టీ20 ర్యాంకుల్లోకి దూసుకెళ్లేలా చేసింది. తర్వాత ప్రతి మ్యాచ్‌లోనూ బాదడమే. గత ఆసియా కప్‌లో ఏడు మ్యాచుల్లో 200 స్ట్రైక్‌రేట్‌తో 314 పరుగులు చేశాడంటే అతడి దూకుడు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆ టోర్నీలో శ్రీలంకపై 61 పరుగుల ఇన్నింగ్స్‌తో ఐసీసీ టాప్ రేటింగ్ (931 పాయింట్లు)ను అందుకొని రికార్డు సృష్టించాడు. అప్పటి వరకూ ఇంగ్లాండ్ ఆటగాడు డేవిడ్ మలన్ (919) పేరిట ఈ ఘనత ఉండేది. గతేడాది ఒక క్యాలెండర్ ఇయర్‌లో 202 స్ట్రైక్‌రేట్‌తో 1000కిపైగా పరుగులు చేసిన తొలి బ్యాటర్‌గా ఘనత సాధించాడు.
సచిన్ లాంటి కెరీర్‌ను సూర్యవంశీ నిర్మించుకోవాలి: సైకియా

**యువీ ప్రభావం..**

యువరాజ్ సింగ్‌ను అభిషేక్ శర్మ ఆరాధిస్తాడు. ఇక బ్రియాన్ లారా అంటే కూడా ఇష్టమే. వీరిద్దరి దూకుడును అభిషేక్‌లో చూడొచ్చు. కొవిడ్ సమయంలో యువీ వద్దే క్రికెట్ నైపుణ్యాలకు అభి పదునుపెట్టుకున్నాడు. ఇప్పటికీ యువీతో కలిసి ప్రాక్టీస్ చేస్తుంటాడు. ఈ మాజీ క్రికెటర్‌ను తన గురువుగా చెబుతుంటాడు. ఇక సోషల్ మీడియాలోనూ అభిషేక్ యాక్టివ్‌గా ఉంటాడు. అతడి ఇన్‌స్టాను దాదాపు 11 మిలియన్ల మంది ఫాలో అవుతారు. స్టైలిష్ లుక్‌తో కనిపించే అభి ఓసారి తన సహచరుడు వైభవ్ సూర్యవంశీని కూడా తనలాగే మార్చేశాడు. ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్నప్పుడు వింబుల్డన్ మ్యాచ్‌ను చూసేందుకు వెళ్లిన వీరి ఫొటోలు వైరల్‌గా మారాయి.

**బ్యాటింగ్‌తోపాటు బౌలింగ్‌లోనూ**

పొట్టి ఫార్మాట్ అంటేనే వీరబాదుడు. అందుకే 26 ఏళ్ల అభిషేక్ శర్మ ను టీ20 స్పెషలిస్ట్ అంటారు. కేవలం బ్యాటర్ అయితే ఇంత చర్చ అవసరం లేదు. బంతితోనూ మెరిపించగలడు. జాతీయ జట్టుకు ఆడేటప్పుడూ తన పార్ట్‌టైమ్ స్పిన్‌తో ఆకట్టుకున్నాడు. మూడున్నరేళ్ల వయసులోనే బ్యాట్‌ను చేతబట్టాడు. అతడి తండ్రి రాజ్ కుమార్‌కు దేశవాళీ క్రికెట్ ఆడిన అనుభవం ఉంది. అందుకేనేమో.. అభి చాలా త్వరగా క్రికెట్ పాఠాలను నేర్చుకున్నాడు. 2015-16 విజయ్ మర్చంట్ ట్రోఫీలో 1,200కిపైగా పరుగులు చేయడమే గాక, 57 వికెట్లు పడగొట్టాడు. ఆసియా కప్‌లో అండర్-19 జట్టుకు సారథిగానూ పనిచేశాడు. 17 ఏళ్ల వయసులోనే ఐపీఎల్‌లో ఎంట్రీ ఇచ్చాడు. 2018 వేలంలో నాటి దిల్లీ డేర్‌డెవిల్స్ అతడిని తీసుకుంది. మొదట్లో పెద్దగా ప్రభావం చూపించని ఈ కుర్రాడు.. ఎప్పుడైతే సన్‌రైజర్స్‌కు మారాడో, అప్పటినుంచి తనలోని అసలైన హిట్టర్‌కు బయటకు తెచ్చాడు. రికార్డులను కొల్లగొట్టాడు. అదే అతడిని భారత జట్టులోకి వచ్చేలా చేసింది.



## సబలెంకా, స్వైటెక్ జోరు

**మూడో రౌండ్లోకి ప్రవేశం**

**అల్కరాస్ ముందంజ**

**యుఎస్ ఓపెన్**

**సబలెంకా**



యుఎస్ ఓపెన్లో టైటిల్ ఫేవరెట్లు అర్యానా సబలెంకా (బెలారస్), ఇగా స్వైటెక్ (పోలెండ్) దూసుకెళున్నారు. మహిళల సింగిల్స్ రెండో రౌండ్లో డిఫెండింగ్ ఛాంపియన్ సబలెంకా 6-1, 6-1తో పోలీనా ఇయాసెంకో (రష్యా)ను చిత్తు చేసింది. తొలి సెట్ ఆరంభంలోనే ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసిన ఈ బెలారస్ స్టార్.. 5-0తో తిరుగులేని స్థితిలో నిలిచింది. అదే జోరుతో సెట్ గెలిచింది. రెండో సెట్ కూడా తొలి సెట్ మాదిరే సాగింది. 5-1తో ఆధిక్యంలో నిలిచిన సబలెంకా.. అదే ఊపులో సెట్‌తో పాటు మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. ఆరుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసిన సబలెంకా.. 24 విన్నర్లు, 3 ఏస్‌లు కొట్టింది. మరో మ్యాచ్‌లో స్వైటెక్ 6-3, 6-2తో నాడియా పొడోర్కా (అర్జెంటీనా)ను ఓడించింది. ఆరో సీడ్ నోస్కోవా (చెకియా), ఏడో సీడ్ ముచోవా (చెకియా), 11వ సీడ్ కోస్త్యుక్ (ఉక్రెయిన్), 13వ సీడ్ ఒసాకా (జపాన్) ముందంజ వేశారు. నోస్కోవా 6-4, 6-2తో టారారుడీ (థాయ్‌లాండ్)పై, కోస్త్యుక్ 6-1, 7-5తో స్లోన్ (అమెరికా)పై, ముచోవా 6-1, 6-0తో బౌల్టర్ (బ్రిటన్)పై, ఒసాకా 6-2, 5-7, 6-1తో సినియాకోవా (చెకియా)పై నెగ్గారు. స్వితోలినా (ఉక్రెయిన్), పొటపోవా (ఆస్ట్రియా) కూడా మూడో రౌండ్ చేరారు.

# సచిన్ లాంటి కెరీర్‌ను సూర్యవంశీ నిర్మించుకోవాలి: సైకియా



ఇంటర్నెట్ డెస్క్: యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ప్రశంసల వర్షం కురిపించారు. దిగ్గజ క్రికెటర్ సచిన్ తెందుల్కర్‌లా అద్భుతమైన కెరీర్‌ను నిర్మించుకోవాలని సూచించారు. ఏదో ఒక సిరీస్ లేదా ఒక సంవత్సరంలో మాత్రమే కన్పించే వండర్ ప్లేయర్‌గా మారకూడదన్నారు. గురువారం బీసీసీఐ రివ్యూ మీటింగ్ జరిగిన సంగతి తెలిసిందే. అనంతరం సైకియా విలేకర్లతో మాట్లాడుతూ పలు విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా వైభవ్ సూర్యవంశీ ప్రస్తావననూ తీసుకొచ్చారు. "ఓ 15 ఏళ్ల కుర్రాడిని అంతర్జాతీయ క్రికెట్‌లోకి తీసుకొచ్చినందుకు బీసీసీఐ గర్వపడుతోంది. అతడి సత్తా ఏంటో ఇప్పటికే అభిమానులకు చూపించాడు. ముమ్ముందూ ఇలానే సరైన మార్గంలో సాగాలని కోరుకుంటున్నా. కొన్ని మ్యాచులకే పరిమితం కాకుండా.. సుదీర్ఘమైన కెరీర్‌ను నిర్మించుకోవాలి. అందుకు భారత క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్‌ను వైభవ్ ఆదర్శంగా తీసుకోవాలి. అంతర్జాతీయ కెరీర్‌లో అతడు వేసే ప్రతి అడుగును అన్ని కోణాల నుంచి నిశితంగా గమనిస్తూనే ఉంటాం. వైభవ్ భవిష్యత్తుపై బీసీసీఐ ప్రత్యేక దృష్టిసారించింది" అని సైకియా వెల్లడించారు.

**సఫారీలతో వన్డే సిరీస్ ?**

ఇదిలా ఉండగా.. వచ్చే ఏడాది వన్డే ప్రపంచ కప్ జరగనుంది. దక్షిణాఫ్రికా, నమీబియా, జింబాబ్వే సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. అయితే, వరల్డ్ కప్ ముంగిట సఫారీ జట్టుతో సిరీస్ ఆడితే బాగుంటుందనేది భారత జట్టు ఆలోచన. ఇదే విషయమై మేనేజ్‌మెంట్ కూడా దక్షిణాఫ్రికా బోర్డుతో మాట్లాడినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ వన్డే సిరీస్‌లో కనీసం నాలుగు నుంచి ఆరు మ్యాచులు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ మేరకు బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు, భారత ఆటగాళ్ల ఫిట్‌నెస్ విషయంలోనూ బోర్డు కఠినంగా ఉండనుంది. రివ్యూ మీటింగ్‌లో ఇదే ప్రధాన అంశంగా చర్చించినట్లు సమాచారం.



# 140కిలోలు ఎత్తి ఇంటర్నెట్ సెన్సేషన్..

## ఆన్‌లైన్ వేధింపులపై ఆవేదన

సంచలన ప్రదర్శనతో భారత క్రీడాభిమానులను ఆకట్టుకున్న కేయా బెనర్జీకి ఆన్‌లైన్ వేధింపులు ఎదురయ్యాయి. స్వయంగా ఆమే తన ఆవేదనను వెల్లడించింది. ఇటీవలే ఐపీఎఫ్ వరల్డ్ సబ్ జూనియర్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో కేయా రజతం సాధించిన సంగతి తెలిసిందే. ఏకంగా 140 కిలోలు ఎత్తింది. కేవలం 21 ఏళ్ల వయసులో తన బరువు కంటే మూడున్నర రెట్లు అధికంగా లిఫ్ట్ చేసిందని సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే, కొందరు తన చిత్రాలను అసభ్యకరంగా మార్చి వేధింపులకు గురి చేస్తున్నారంటూ ఆమె వాపోయింది. ఈ మేరకు తన కొత్త ఖాతా నుంచి సుదీర్ఘమైన పోస్టు పెట్టింది.
"హాయ్.. నేను చేసిన ఈ పోస్టును చదివేందుకు ఆగినందుకు కృతజ్ఞతలు. నేను ఇటీవలే ఛాంపియన్‌షిప్‌లో సిల్వర్ మెడల్ సాధించాను. నా కష్టాన్ని గుర్తించి మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. అయితే, ఓ భారత మహిళా అథ్లెట్‌గా నేను ఆన్‌లైన్‌లో ఎదురైన లైంగిక వేధింపులతో పోరాడా. సోషల్ మీడియా నాపేరు మీద ఫేక్ ఖాతాలను చూశా. నా జాతి, వంశం, కులానికి సంబంధించి చెత్త సంభాషణలు ఇంకా కలవరానికి గురి చేస్తున్నాయి. నా శరీరం, ముఖాన్ని అసభ్యకరంగా మార్ఫింగ్ చేసిన వేలాది ఏఐ జనరేటెడ్ ఫొటోలు సోషల్ మీడియాలో ప్రత్యక్షం కావడం నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేస్తోంది.
నేనెప్పుడూ నా వ్యక్తిగత ఖాతాల నుంచి ఫొటోలను షేర్ చేయను. ప్రైవేట్ పర్సన్‌గానే ఉండేందుకు ఇష్టపడతా. నా పాత అకౌంట్స్‌లోనూ అలాంటి ఉండవు. జీవితంలో క్రీడలను ఎంచుకోవడానికి కారణం సవాళ్లను ఎదుర్కొని ముందుకు సాగడమే నా లక్ష్యం. అయితే, ప్రతి రోజూ నిద్రలేవగానే నా ఫీడ్ అంతా ఈ నకిలీ ఏఐ చిత్రాలతోనే నిండిపోవడంతో అసహనం కలుగుతోంది. నా పాత అకౌంట్‌ను ఇప్పటికే ఇన్‌స్టా సస్పెండ్ చేసింది. అందులో కేవలం 300 మంది ఫాలోవర్లు మాత్రమే ఉన్నారు. ఇప్పుడు కొత్త అకౌంట్ నుంచి ఈ పోస్టు పెడుతున్నా. దీనిని కూడా బహిర్గతం చేయాలని ఎప్పుడూ అనుకోలేదు. క్రీడల్లో నేను సాధించిన విజయాలను మాత్రమే ప్రస్తావించాలని భావించా. అయితే, నా ఖాతా మళ్లీ సస్పెండ్ కాకుండా ఉండేందుకే నా పక్షాన నేను నిలబడేందుకు నాకు వేరే మార్గం కనిపించడం లేదు. అందుకే, ఇప్పుడు ఈ విషయాలను వెల్లడించా" అని కేయా బెనర్జీ (ఖవఋఞ దీఞఅవతీయఱ) తన పోస్టులో పేర్కొంది.

# అడోబ్ సీఈఓగా మళ్లీ భారతీయుడే..



అమెరికాకు చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ అడోబ్ నాయకత్వ పగ్గాలు మళ్లీ భారతీయుడికే దక్కాయి. ఇప్పటివరకు సీఈఓగా ఉన్న శంతను నారాయణ్ ఆ పదవి నుంచి వైదొలుగుతున్న సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో కంపెనీ నూతన సీఈఓ గా అనిల్ చక్రవర్తి నియమితులయ్యారు. డిసెంబర్ 1న అనిల్ ఈ కొత్త బాధ్యతలు స్వీకరించనున్నట్లు కంపెనీ వెల్లడించింది.

ప్రస్తుతం మార్కెట్‌లో ఏఐ ప్రభావం నేపథ్యంలో డిజైన్ క్రియేటివ్ సాఫ్ట్‌వేర్‌లో తన స్థానాన్ని బలోపేతం చేసుకోవడానికి అడోబ్ కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలో సంస్థలో నాయకత్వ మార్పు చోటుచేసుకోవడం గమనార్హం. దాదాపు రెండు దశాబ్దాలుగా సీఈఓగా కొనసాగుతోన్న శంతను నారాయణ్ (రాష్ట్రుత్ఖుఅబ చీఖుతీఖుఎవఅ) ఈ పదవి నుంచి వైదొలుగుతున్నట్లు మార్చిలో కంపెనీ ప్రకటించింది. ప్రస్తుతం ఈయన ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుత ఏఐ యుగంలో అడోబ్ వృద్ధికి నాయకత్వం వహించడానికి అనిల్ సరైన వ్యక్తి అని నమ్ముతున్నానని శంతను నారాయణ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**ఏఐ వినియోగంలో అగ్రగామి భారత్**

భారత్‌కు చెందిన అనిల్ చక్రవర్తి ఐఐటీ వారణాసి నుంచి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ చదివారు. మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో మాస్టర్ ఆఫ్ సైన్స్, పీహెచ్‌డీ పట్టాలు పొందారు. 2020లో ఆయన అడోబ్‌లో చేరారు. కొన్నేళ్లపాటు డిజిటల్ ఎక్స్‌పీరియన్స్ వ్యాపారానికి నాయకత్వం వహించారు. అనంతరం కస్టమర్ సపోర్ట్ కార్యకలాపాలను పర్యవేక్షించే బాధ్యత చేపట్టారు. అదే సమయంలో సంస్థ గ్లోబల్ సేల్స్‌ను కూడా పర్యవేక్షించారు. అడోబ్‌లో చేరడానికి ముందు అనిల్ చక్రవర్తి క్లౌడ్ డేటా–మేనేజ్‌మెంట్ కంపెనీ ఇన్‌ఫర్మేటికాలో నాలుగేళ్ల పాటు చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేశారు.

# 1,00,000 మంది ఉద్యోగులను తొలగిస్తున్నాం:

## ఫోక్స్‌వ్యాగన్ ప్రకటన



జర్మనీ కార్ల తయారీ దిగ్గజం ఫోక్స్‌వ్యాగన్ భారీ సంఖ్యలో ఉద్యోగులను తగ్గించుకోనుంది . ఈ దశాబ్దం చివరినాటికి లక్ష ఉద్యోగాలకు కోత పెట్టనుంది. ఈ మేరకు యాజమాన్యం, కార్మిక సంఘాలు ఒక అంగీకారానికి వచ్చాయని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. తొలుత 50వేల మందిని తొలగించాలని నిర్ణయించిన సంస్థ.. అదనంగా మరో 50వేలమంది తొలగింపు ప్రణాళికను కూడా ఆమోదించినట్లు చెప్పింది. "కంపెనీ ఆర్థికపరమైన అంశాలకు తగ్గట్టుగా శ్రామికశక్తి సర్దుబాటు చేయడం తప్పనిసరి" అని పేర్కొంది. ఇదే జరిగితే.. ఇది ఆటో పరిశ్రమ చరిత్రలోనే అతిపెద్ద పునర్వ్యవస్థీకరణ కానుంది.

కంపెనీ మొత్తం ఉద్యోగుల్లో ఈ లక్ష మంది దాదాపు 15 శాతానికి సమానం. ప్రస్తుతం ఫోక్స్ వ్యాగన్ గ్రూప్‌లో దాదాపు 6.67 లక్షల మంది పనిచేస్తున్నారు. ఒక్క జర్మనీలోనే 43 శాతం మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ కోతలను కార్మిక సంఘాలు వ్యతిరేకించినట్లు గతంలో వార్తలు వచ్చాయి. ఇప్పుడు కంపెనీ ప్రకటనలో కోతలకు ఆ సంఘాలు కూడా అంగీకరించినట్లు పేర్కొనడం గమనార్హం. అలాగే నాలుగు జర్మన్ ప్లాంట్లను మూసే ప్రణాళికను ప్రస్తావించింది.

పేపాల్‌లో లేఆఫ్‌లు.. భారీగా ఉద్యోగుల తొలగింపు

ఇదిలాఉంటే, ఉంటే.. ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి అయ్యే భారీ ఖర్చులు, చైనా నుంచి ఎదురవుతున్న తీవ్రమైన పోటీ, అంతర్జాతీయ టారిఫ్‌ల ఒత్తిళ్లను తట్టుకోవడానికి ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. ఈ సంస్థ ఫోక్స్‌వ్యాగన్, ఆడి, పోర్షే, లాంబోర్గిని, బెంట్లీ వంటి పాసింజర్ వాహనాలతో పాటు, స్కానియా, డుకాటీ వంటి కమర్షియల్, టూవీలర్ ఆటోమొబైల్ బ్రాండ్లను నిర్వహిస్తోంది. దివాలా తీసినట్లు 2009లో జనరల్ మోటార్స్ ప్రకటించిన తర్వాత 50,000 మంది ఉద్యోగులను తొలగించింది. ఇప్పుడు ఫోక్స్ వ్యాగన్ లేఆఫ్‌ల సంఖ్య దానిని అధిగమించింది.

# నాలుగు రోజుల వరుస నష్టాలకు విరామం

**ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం లాభాల్లో ముగిశాయి. అమెరికాలో వడ్డీ రేట్ల భయాలు సన్నిల్లడంతో అంతర్జాతీయ మార్కెట్లు సహా దేశీయ మార్కెట్ సూచీలు లాభపడ్డాయి. దీంతో నాలుగు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది.**

**సెన్సెక్స్ ఉదయం 76,657.02 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,152.86) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 76,883.14 పాయింట్ల వద్ద గరిష్టాన్ని తాకిన సూచీ.. చివరికి 362.57 పాయింట్ల లాభంతో 76,515.43 వద్ద ముగిసింది.**




**మార్కెట్ వివరాలు**

| | |
|---|---|
| డాలరుతో రూపాయి మారకం విలువ | 94.49 |
| బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర | 95.22 డాలర్లు |
| బంగారం ఔన్సు ధర | 4,472 డాలర్లు |

**నిఫ్టీ సైతం 24.25 పాయింట్ల లాభంతో 23,897.70 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 94.49గా ఉంది.**

**లాభపడ్డ టాప్ షేర్లు (సెన్సెక్స్ 30)**

టాటా స్టీల్ | రిలయన్స్ | బజాజ్ ఫైనాన్స్ | ట్రెంట్ | అదానీ పోర్ట్స్

**నష్టపోయిన టాప్ షేర్లు (సెన్సెక్స్ 30)**

భారతీ ఎయిర్‌టెల్ | హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ | ఎటర్నల్ | ఏషియన్ పేయింట్స్ | టీసీఎస్

# కోల్ గ్యాసిఫికేషన్ స్కీమ్.. ప్రాజెక్ట్‌కు ఒక్కరూ ముందుకు రాలేదు



దిల్లీ: కేంద్రం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన కోల్ గ్యాసిఫికేషన్ స్కీమ్‌కు ఆదరణ కరవైంది. రూ.37,500 కోట్ల ప్రోత్సాహక పథకం కింద ఈ ప్రాజెక్ట్ ఏర్పాటుకు ఒక్కరూ ముందుకు రాలేదు. సెప్టెంబర్ 7తో ప్రభుత్వం నిర్దేశించిన గడువు ముగియనుండగా.. ప్రైవేటు సంస్థల నుంచి గానీ, ప్రభుత్వ రంగం నుంచి గానీ ఒక్క దరఖాస్తూ రాకపోవడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. మన దేశంలో బొగ్గు నిల్వలు పుష్కలం. కానీ కర్బన ఉద్గారాల బెడద కారణంగా వాటిని సమర్థంగా వినియోగించుకోలేక.. ఇంధన అవసరాల కోసం దిగుమతులపైనే అధికంగా ఆధారపడుతున్నాం. ఈ సమస్య నుంచి గట్టెక్కేందుకు 'బొగ్గు వాయువీకరణ (కోల్ గ్యాసిఫికేషన్)' విధానాన్ని ఆయుధంగా మలచుకోవాలని కేంద్రం తాజాగా సంకల్పించింది. ఇందుకోసం రూ.37,500 కోట్లతో ప్రోత్సాహక పథకానికి మే నెలలో ప్రధాని మోదీ నేతృత్వంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఆమోద ముద్ర పడింది. 75 మిలియన్ టన్నుల బొగ్గును గ్యాసిఫై చేయడమే లక్ష్యంగా ఇటీవల ఈ పథకాన్ని కేంద్రం ప్రకటించింది.

# కెన్యా యూనిట్‌లో సమస్య పరిష్కారానికి సిద్ధం: టాటా కెమికల్స్




కెన్యా లోని టాటా కెమికల్స్ కార్యకలాపాలు నిలిపేయాలని ఆ దేశాధ్యక్షుడు చేసిన హెచ్చరికలపై టాటా గ్రూప్‌నకు చెందిన టాటా కెమికల్స్ స్పందించింది. ఆ యూనిట్‌లో సమస్యను చట్టబద్ధంగా పరిష్కరించుకోవడానికి సిద్ధమవుతున్నట్లు తెలిపింది. ఈ విషయంపై ప్రభుత్వంతో చర్చలు జరపనున్నట్లు వెల్లడించింది. 2005లో టాటా కెమికల్స్ మగాడి లిమిటెడ్ (౧జమీా) ప్లాంట్‌ను ప్రారంభించినప్పటి నుంచి తూర్పు ఆఫ్రికా దేశ ఆర్థిక వ్యవస్థలో తమ సంస్థ కీలక పాత్ర పోషించిందని పేర్కొంది. పెండింగ్‌లో ఉన్న ఇతర సమస్యలను కూడా పరిష్కరించడానికి కట్టుబడి ఉన్నామని తెలిపింది.

జులై 28, 2026న ఆ ప్రదేశంలో మైనింగ్ కార్యకలాపాలను నిలిపివేసినట్లు కంపెనీ వెల్లడించింది. వాటికి సంబంధించిన మైనింగ్ పత్రాలను సంబంధిత మంత్రిత్వ శాఖకు సమర్పించినట్లు తెలిపింది. మంత్రిత్వ శాఖ లేవనెత్తిన అన్ని అంశాలకు సంబంధించిన సమగ్ర నివేదికలు అందించినట్లు పేర్కొంది. తదుపరి ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నట్లు స్పష్టం చేసింది. ఉద్యోగులు, మగాడి కమ్యూనిటీ, కెన్యాలోని వాటాదారుల సంక్షేమంపై కట్టుబడి ఉన్నామంది. కెన్యా ఆర్థికాభివృద్ధే తమ ప్రధాన ప్రాధాన్యతగా కొనసాగుతుందని స్పష్టం చేసింది.

**కెన్యా అధ్యక్షుడు ఏమన్నారంటే..?**


కెన్యా అధ్యక్షుడు విలియం రూటో (ఖవఅఋ ౹ాతీవంఱనవత్ ఔఱశ్రీశ్రీఋఎ =భ్శీ) గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. లేక్ మగాడి ప్రాంతంలోని టాటా కెమికల్స్ కార్యకలాపాలు నిలిపేయాలని కంపెనీని ఆదేశించారు. తమ దేశంలోని వనరులను ఉపయోగించుకుంటున్నప్పటికీ.. ఆ కంపెనీ స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వట్లేదని ఆరోపించారు. టాటాకు సుమారు 100 ఏళ్ల కాంట్రాక్ట్ ఉన్నప్పటికీ తమ పౌరులకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. అందువల్ల కంపెనీని మూసివేయాలని ఆదేశించారు. కాగా, టాటా కెమికల్స్ మగాడి ఆఫ్రికాలోనే అతిపెద్ద సోడా యాష్ ఉత్పత్తి కేంద్రంగా పేరొందింది.

# రెట్టింపు నవ్వులతో... రంభ ఊర్వశి మేనక



"చిన్నప్పట్నుంచి నేను నాగార్జున అభిమానిని. ఆయనతో కలిసి 'నా సామి రంగ' సినిమాలో నటించా. ఇప్పుడు ఆయన నిర్మాణంలోనూ హీరోగా నటించడం ఎంతో సంతోషంగా ఉంది" అన్నారు అల్లరి నరేశ్. ఆయన కథానాయకుడిగా... చంద్రమోహన్ చింతాడ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమే 'రంభ ఊర్వశి మేనక'. సురభి, విష్ణుప్రియ, రాశీ సింగ్, ప్రిషాసింగ్ ముఖ్య పాత్రలు పోషించారు. అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ సంస్థలపై రాజేశ్ దండా, నిమ్మకాయల ప్రసాద్ కలిసి నిర్మించారు. ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహించారు.కథానాయకుడు అల్లరి నరేశ్ మాట్లాడుతూ "ఇదివరకటి సినిమాలతో పోలిస్తే రెట్టింపు స్థాయిలో నవ్వించే కుటుంబ కథా చిత్రమిది. నటీనటులంతా ఎంతో స్నేహపూర్వకంగా మెలుగుతూ ఉత్సాహంగా నటించారు. నాకంటే కూడా దర్శకుడు చంద్రమోహన్ కోసం ఈ సినిమా పెద్ద విజయం సాధించాలి. తను దర్శకుడు కావడానికి చాలా కష్టపడ్డాడు. ఇక్కడ నుంచి ఆయన విజయ పరంపర మొదలు కావాలని కోరుకుంటున్నా. 'అల్లరి' నుంచి నాకు నిమ్మకాయల ప్రసాద్‌తో పరిచయం ఉంది. కథల విషయంలో ఆయన నిర్ణయాలు బాగుంటాయి. ఈ సినిమాతో మేం తప్పకుండా విజయాన్ని అందుకుంటున్నాం, 9న విజయోత్సవాన్ని ఏర్పాటు చేస్తున్నాం" అన్నారు. అచ్చ తెలుగు హాస్య ప్రధానమైన సినిమా ఇదనీ, నవ్వులకు మాదీ హామీ అని అన్నారు నిర్మాత రాజేశ్ దండా. ఈ కార్యక్రమంలో నిర్మాతలు వై.రవిశంకర్, ఎస్.కె.ఎన్‌తోపాటు చిత్రబృందం పాల్గొంది.

# తొలిసారి అలాంటి కథలో!



'ఇరుముడి' విజయంతో ఫుల్ జోష్‌లో ఉన్నారు రవితేజ. ఇప్పుడీ ఊపులోనే కొత్తగా రెండు సినిమాలకు సంతకాలు చేసేశారు. వాటిలో ఒకటి వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో రూపొందనున్న సంగతి తెలిసిందే. 'సరిపోదా శనివారం' విజయం తర్వాత వివేక్ తెరకెక్కిస్తున్న చిత్రమిది. దీనికోసం రవితేజ తొలిసారి మునుపెన్నడూ స్పృశించని కథలో భాగమవుతున్నట్లు తెలిసింది. ఇది హారర్, కామెడీ అంశాల మేళవింపుగా ఉంటుందని సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా పూర్వ నిర్మాణ పనుల్లో ఉంది. రవితేజ - హసిత్ గోలిల ప్రాజెక్ట్ పూర్తయిన వెంటనే ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్తుంది. దీన్ని లక్ష్మణ్, శ్రీని సంయుక్తంగా నిర్మించనున్నారు.



# ఇప్పటికీ ఆ నిర్ణయంపై పశ్చాత్తాపమే!: కరీనా కపూర్

"నేను నా చదువును పూర్తి చేయలేదు. ఆ విషయంలో బాధగా అనిపిస్తుంటుంది. చదివే అవకాశం ఉన్నప్పటికీ.. నటనను వృత్తిగా ఎంచుకొని సినిమాల్లోకి వచ్చాను. 11వ తరగతి తర్వాత చదువును కొనసాగించలేదు. చాలా మంది ఈ విషయంలో నన్ను చూసి ఎగతాళి చేస్తారని, వాళ్లకి నచ్చింది అనుకుంటారని నాకు తెలుసు. కానీ ఒక నటిగా నన్ను నేను నిరూపించుకోవాలనుకున్నా. నా మనసుకు నచ్చినట్టుగా నడుచుకోవాలని కోరుకున్నా. అందుకే నా పిల్లల్ని ముందు చదువు పూర్తి చేసి.. ఆ తర్వాతే వారి మనసుకు నచ్చిన మార్గాన్ని ఎంచుకోమని ప్రోత్సహిస్తున్నా. భారతదేశంలో బాలికల విద్యకు మద్దతు ఇవ్వడం గురించి యూనిసెఫ్ నన్ను సంప్రదించినప్పుడు.. చాలా భావోద్వేగానికి గురయ్యాను. ఎందుకంటే నా చదువును పూర్తి చేయలేదనే పశ్చాత్తాపాన్ని ఇప్పటికీ మోస్తూనే ఉన్నాను".

# రామోజీ ఫిల్మ్‌సిటీలో 'డేవిడ్ రెడ్డి' భారీ పోరు



మంచు మనోజ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'డేవిడ్ రెడ్డి'. హనుమా రెడ్డి యక్కంటి దర్శకత్వం వహిస్తున్నారు. 1897, 1920ల మధ్య బ్రిటిష్ కాలం నాటి నేపథ్యంలో దీన్ని తీర్చిదిద్దుతున్నారు. మారియా ర్యాబోషాప్కా కథానాయిక. సముద్రఖని, రమ్యకృష్ణ కీలక పాత్రలు పోషిస్తున్నారు. నల్లగంగుల వెంకట్ రెడ్డి, భరత్ మోటుకూరి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం దసరాకి రానుంది. ప్రస్తుతం ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామా చిత్రీకరణ రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతోంది. 45రోజులుగా సాగుతోన్న ఈ షెడ్యూల్‌లో ప్రస్తుతం భారీ స్థాయిలో జైలు నేపథ్యంలో వచ్చే సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. కథతో కీలకమైన ఈ జైలు ఎపిసోడ్‌ను భారీ సెటప్‌తో, ఇంటెన్స్ యాక్షన్, ఎమోషన్‌తో తెరకెక్కిస్తున్నట్లు చిత్రవర్గాలు వెల్లడించాయి."ఈ సినిమాలో మనోజ్, సముద్రఖని మధ్య వచ్చే యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులకి థ్రిల్ పంచేలా ఉంటాయి. ఈ చిత్రంతో అఖిల్ అనే కొత్త నటుణ్ని ప్రతినాయకుడిగా పరిచయం చేస్తున్నాం. ఇందులో రమ్యకృష్ణ, మనోజ్‌ల నేపథ్యంలో వచ్చే సీన్లు హృదయాలను హత్తుకుంటాయి. ఈ కథలో డేవిడ్ రెడ్డి పాత్రకు మహాత్మాగాంధీ, సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్ లాంటి ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులతో ఉన్న సంబంధాన్ని సరికొత్త కోణంలో చూపించబోతున్నాం. ప్రత్యేకంగా రూపొందించిన వార్ డాగ్ బైక్ కూడా ఈ సినిమాకి మరో ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. బ్రిటిష్ కాలం నాటి ప్రపంచాన్ని మరింత సహజంగా, భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి వీఎఫ్ఎక్స్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నామ"ని తెలిపాయి. మరోవైపు షూటింగ్‌ను శరవేగంగా పూర్తి చేస్తూనే.. నిర్మాణానంతర పనుల్ని కూడా ఇప్పటికే ప్రారంభించినట్లు తెలిపింది చిత్రబృందం.

# దుల్కర్ అభిమానులకు నిరాశ.. 'ఐ యామ్ గేమ్' విడుదల ఆలస్యం



దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రలో, నహాస్ హిదాయత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఫాంటసీ థ్రిల్లర్ 'ఐ యామ్ గేమ్'. ఆంటోనీ వర్గీస్, మిస్కిన్, కయాదు లోహర్ కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమా కోసం ఎదురుచూసిన తెలుగు ప్రేక్షకులకు నిరాశ ఎదురైంది. తెలుగు వెర్షన్ నేడు విడుదల కావాల్సి ఉండగా.. చివరి నిమిషంలో ఆగిపోయింది. దీనిపై టీమ్ స్పందించింది."కొన్ని సాంకేతిక కారణాల వల్ల 'ఐ యామ్ గేమ్' తెలుగు విడుదల ఆలస్యం అయింది. మలయాళ వెర్షన్‌లో సినిమా ఇప్పటికే విడుదలైంది. అక్కడ షోస్ యథాతథంగా ప్రేక్షకులను అలరిస్తున్నాయి. కొంచెం ఆలస్యంగా తెలుగులోనూ అందుబాటులోకి తీసుకొస్తాం. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నాం" అని చిత్రబృందం నోట్ విడుదల చేసింది. పూర్తిస్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా, భారీ బడ్జెట్‌తో 'ఐ యామ్ గేమ్' రూపొందింది. కామెడీ, రొమాన్స్, మిస్టరీ, సస్పెన్స్, యాక్షన్, థ్రిల్లర్, గేమింగ్ అంటూ ప్రేక్షకులను ఆకట్టుకునే పలు అంశాలు ఇందులో ఉన్నాయని టీమ్ తెలిపింది.

# మెగా ఫ్యామిలీ కృష్ణాష్టమి వేడుకలు.. క్యూట్ ఫొటో పంచుకున్న ఉపాసన



అగ్ర కథానాయకుడు రామ్ చరణ్ , ఉపాసన దంపతులు తమ చిన్నారులతో కలిసి కృష్ణాష్టమి వేడుకలు చేసుకున్నారు. తమ ముగ్గురు పిల్లలను శ్రీకృష్ణుడు, రాధారాణి రూపాల్లో ముచ్చటగా ముస్తాబు చేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోను ఉపాసన అభిమానులతో పంచుకున్నారు. 'కొణిదెల వారి ఇంట్లోకి చిన్ని కృష్ణుడు అడుగుపెట్టాడు' అంటూ రాసుకొచ్చారు. కలనెరవేరిందంటూ ఆమె షేర్ చేసిన ఈ ఫొటో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది.రామ్ చరణ్ - ఉపాసన దంపతులకు 2023 జూన్ 20న క్లీంకార జన్మించగా, ఈ ఏడాది ఫిబ్రవరిలో వీరికి కవలలు జన్మించారు. అబ్బాయికి శివరామ్, అమ్మాయికి అన్వీరా దేవి అని పేరు పెట్టిన సంగతి తెలిసిందే. ఇక సినిమాల విషయానికొస్తే ప్రస్తుతం రామ్ చరణ్.. సుకుమార్ దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నారు.

# నిద్రలో చెమటలు పడుతున్నాయా?
# కారణం ఇదే కావచ్చు!

**రాత్రిపూట నిద్రలో చెమట పడడం చాలామందిలో కనిపించే సమస్యే. గది వేడిగా ఉండటం, ఎక్కువ దుప్పట్లు కప్పుకోవడం లేదా రోజంతా శారీరక శ్రమ చేయడం వల్ల చెమట పడడం సాధారణమే. కానీ వాతావరణం చల్లగా ఉన్నా.. ఫ్యాన్, ఏసీ పనిచేస్తున్నా నిద్రలో పదేపదే విపరీతంగా చెమట పడుతుంటే మాత్రం కారణాన్ని తెలుసుకోవడం అవసరం. కొన్ని సందర్భాల్లో ఇది శరీరంలో జరుగుతున్న మార్పులకు లేదా ఆరోగ్య సమస్యలకు సంకేతం కావచ్చని నిపుణులు చెబుతున్నారు.**



## థైరాయిడ్ సమస్యలు



థైరాయిడ్ గ్రంథి శరీర జీవక్రియను నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది అవసరానికి మించి చురుగ్గా పనిచేస్తే హైపర్‌థైరాయిడిజం సమస్య వస్తుంది. ఈ పరిస్థితిలో శరీరం ఉష్ణోగ్రతను తట్టుకోవడం కష్టంగా మారి ఎక్కువగా చెమట పట్టే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా రాత్రివేళల్లో చెమటలు పట్టడం కూడా ఈ సమస్య లక్షణాల్లో ఒకటిగా ఉండొచ్చు.

## ఒత్తిడి, ఆందోళన కూడా కారణమే



ఎక్కువ ఒత్తిడి, ఆందోళనకు గురైనప్పుడు శరీరంలో కొన్ని మార్పులు చోటు చేసుకుంటాయి. గుండె వేగంగా కొట్టుకోవడం, శ్వాస వేగం పెరగడం, కండరాలు బిగుసుకుపోవడం వంటి లక్షణాలతో పాటు చెమట కూడా పట్టవచ్చు. మానసిక ఒత్తిడి ఎక్కువగా ఉన్న సమయంలో నిద్రలోనూ చెమటలు పట్టే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

## మెనోపాజ్ సమయంలో



**ముఖ్యంగా 40 ఏళ్లు దాటిన మహిళల్లో రాత్రిపూట అకస్మాత్తుగా చెమటలు పట్టడం కనిపిస్తే మెనోపాజ్ దశకు సంబంధించిన మార్పులు కూడా కారణం కావచ్చు. ఈ సమయంలో ముఖం, మెడ, ఛాతీ ప్రాంతాల్లో ఒక్కసారిగా వేడి అనిపించడం, ఆ వెంటనే చెమట పట్టడం వంటి సమస్యలు ఎదురవుతాయి.**

## కొన్ని మందులతోనూ చెమటలు



**కొన్ని రకాల మందులు వాడుతున్నప్పుడు కూడా రాత్రిపూట చెమటలు పట్టే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా కొన్ని యాంటిడిప్రెసెంట్లు, మధుమేహానికి ఉపయోగించే మందులు, స్టిరాయిడ్లు, ఎసిటామినోఫెన్, ఆస్పిరిన్, రక్తపోటు మందులు ఇందుకు కారణం కావచ్చని నిపుణులు చెబుతున్నారు. మందులు వాడుతున్న తర్వాతే ఈ సమస్య మొదలైతే వైద్యులను సంప్రదించి వివరాలు చెప్పాలి.**

**గుర్తుంచుకోండి** రాత్రిపూట చెమటలు పడటం నిర్లక్ష్యం చేయకూడడు. ఇది చిన్న కారణాల వల్ల కావచ్చు. కానీ కొన్ని సందర్భాల్లో తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు సంకేతం కావచ్చు. లక్షణాలు ఎక్కువగా ఉంటే వైద్యుడిని సంపధించడం అత్యపసరం.

**నిద్రలో చెమటలు పడుతున్నాయా? కారణం ఇదే కావచ్చు!**

**ఈ జాగ్రత్తలు పాటించండి**

**గది వాతావరణం: రాత్రిపూట చెమటలు తగ్గించుకోవడానికి పడుకునే గదిని చల్లగా, గాలి ప్రసరణ ఉండేలా చూసుకోవాలి.**

**ఆహారపు అలవాట్లు: నిద్రకు ముందు కేఫిన్, ఆల్కహాల్, ఎక్కువ కారంగా ఉండే ఆహారాన్ని తగ్గించడం ఉపయోగపడవచ్చు.**

**మెనోపాజ్ జాగ్రత్తలు: మెనోపాజ్ దశలో ఉన్న మహిళలు ఆహారపు అలవాట్లపై శ్రద్ధ పెట్టాలి.**

**ఆరోగ్యకర జీవనశైలి: బరువును నియంత్రణలో ఉంచుకోవడం, పోషకాహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగ్గా నిర్వహించుకోవచ్చు.**

**వైద్యుల సలహా: ఏదైనా మందు వాడిన తర్వాతే రాత్రిపూట చెమటలు పడుతున్నట్లు అనిపిస్తే.. ఆ మందును స్వయంగా ఆపకుండా వైద్యులను సంప్రదించాలి.**

**మానసిక ప్రశాంతత: ఒత్తిడి, ఆందోళన తగ్గించుకునేందుకు నచ్చిన పనులకు సమయం కేటాయించడం, తగినంత విశ్రాంతి, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం సహాయపడుతుంది.**

**గుర్తుంచుకోండి: రాత్రిపూట చెమటలు పడటం నిర్లక్ష్యం చేయకూడదు. ఇది చిన్న కారణాల వల్ల కావచ్చు, కానీ కొన్ని సందర్భాల్లో తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు సంకేతం కావచ్చు; లక్షణాలు ఎక్కువగా ఉంటే వైద్యుడిని సంప్రదించడం అత్యవసరం.**

# కిడ్నీలకు ఆహార రక్ష!

**కిడ్నీల కోసం ఆహారంపై శ్రద్ధ అవసరం**

**ప్రొటీన్‌ను పరిమితంగా తీసుకోవాలి**

**ఉప్పు, సోడియం తగ్గించాలి**

**కూల్‌డ్రింక్స్, సోడాలకు దూరంగా ఉండాలి**

**ద్రవాలు డాక్టర్ సూచన మేరకే తీసుకోవాలి**

**పొటాషియం అధిక ఆహారం తగ్గించాలి**

**ఫాస్పరస్ మోతాదును నియంత్రించాలి**

**పచ్చళ్లు, సాస్‌లు, చిప్స్ తగ్గించాలి**


**నూనె, నెయ్యి, వెన్న తగ్గించాలి**

**వేపుళ్లకు దూరంగా ఉండాలి**

**విటమిన్లు, ఐరన్ అవసరాన్ని పరీక్షలతో గుర్తించాలి**

**డాక్టర్ సలహాతో వ్యాయామం చేయాలి**

**కిడ్నీ, గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి**



ఏదైనా జబ్బుందనగానే మనదగ్గర అడిగే మొదటి ప్రశ్న 'పథ్యమేంటి?' అనే. మధుమేహం, గుండెజబ్బుల మాదిరిగానే దీర్ఘకాల కిడ్నీ జబ్బు (సీకేడీ) విషయంలోనూ ఇది తప్పనిసరి. కిడ్నీలు చేసే ప్రధానమైన పని రక్తాన్ని శుద్ధి చేసి, మూత్రాన్ని తయారు చేయటం. దీని ద్వారా వ్యర్థాలను బయటకు పంపటం. కిడ్నీల పనితీరు తగ్గితే ఈ ప్రక్రియ కుంటుపడుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో కిడ్నీలపై మరింత భారం పడితే ఇంకాస్త త్వరగా విఫలమయ్యే ప్రమాదముంది. ఇక్కడే మందులు, చికిత్సలతో పాటు పథ్యం ప్రాధాన్యం సంతరించుకుంటోంది. ఆహార పరంగా చిన్న చిన్న మార్పులు చేసుకున్నా పెద్ద ఫలితమే కనిపిస్తుంది. తినే ఆహారం, తాగే పానీయాలు కిడ్నీల మీద నేరుగా ప్రభావం చూపుతాయి మరి.

కిడ్నీ జబ్బు నియంత్రణలో ప్రొటీన్, పాస్ఫరస్, పొటాషియం, సోడియం, ద్రవాలు చాలా ముఖ్యం. ఈ ఐదూ ఏం తింటున్నాం? ఏం తాగుతున్నాం? అనే వాటితో నేరుగా ముడిపడి ఉంటాయి. కాబట్టి దీర్ఘకాల కిడ్నీ జబ్బు గలవారికి ఆహారం మీద ప్రత్యేక శ్రద్ధ తప్పనిసరి. దీని విషయంలో జాగ్రత్త వహిస్తే కిడ్నీల మీద పడే భారాన్ని తగ్గించుకోవచ్చు. జబ్బు త్వరగా ముదరకుండా, దుష్ప్రభావాలు ముంచుకురాకుండా చూసుకోవచ్చు. కిడ్నీలు దెబ్బతిన్నవారికి రక్తపోటు పెరగటం, గుండెపోటు, గుండె వైఫల్యం వచ్చే అవకాశాలు ఎక్కువ. కొన్ని పదార్థాలు.. ముఖ్యంగా ఉప్పుతో రక్తపోటు పెరిగే ప్రమాదముంది. ఇది కిడ్నీలకు హాని చేస్తుంది. ఆహార నియంత్రణతో కిడ్నీ, గుండె రెండింటినీ కాపాడుకోవచ్చు. మిగతా అవయవాలూ బాగుంటాయి. మొత్తంగా ఆరోగ్యమూ మెరుగవుతుంది. హాయిగా జీవించటం సాధ్యమవుతుంది.

### ప్రొటీన్ తగ్గించటం ముఖ్యం

కండరాలు, ఎముకలు, అనుసంధాన కణజాలాలు, లోపలి అవయవాలు ఆరోగ్యంగా ఉండటానికి ప్రొటీన్ అత్యవసరం. ఇన్‌ఫెక్షన్లతో పోరాడటానికీ ఇది తోడ్పడుతుంది. చిక్కేంటంటే– ప్రొటీన్ విచ్ఛిన్నమయ్యే క్రమంలో వ్యర్థాలు పుట్టుకురావటం. వీటిని కిడ్నీలే తొలగించాల్సి ఉంటుంది. అవసరానికి మించి ప్రొటీన్ తీసుకుంటే రక్తంలో వ్యర్థాలూ ఎక్కువగా పోగవుతాయి. ఇవి కిడ్నీల మీద అదనపు భారం పడేలా చేస్తాయి. కాబట్టి కిడ్నీ జబ్బు గలవారు ఆహారంలో ప్రొటీన్ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు గానీ తగ్గించటం మంచిది. కిడ్నీ జబ్బు దశ, శరీర బరువు, మధుమేహం, కాలేయ జబ్బు వంటి ఇతరత్రా సమస్యలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని దీన్ని పరిమితం చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో ఆహార నిపుణుల సూచనలు కీలకం. ఇంటర్నెట్‌లో చూసో, ఎవరో చెప్పారనో ఎవరికివారు సొంతంగా నిర్ణయాలు తీసుకోవటం ప్రమాదకరం.

మాంసాహార ప్రొటీన్ కన్నా శాకాహార ప్రొటీన్ మంచిది. కంది, మినప, పెసర, శనగ వంటి పప్పులు.. రాజ్మా, సోయాబీన్స్ వంటి వాటితో ప్రొటీన్ దండిగా లభిస్తుంది. మాంసాహారులైతే కొవ్వు తక్కువగా ఉండేవి ఎంచుకోవాలి. గుడ్లు, స్కిన్‌లెస్ చికెన్, చేపల వంటివి మితంగా తినొచ్చు. మాంసం, మాంసం ఉత్పత్తులు తగ్గించుకోవాలి.

### ఫాస్పరస్ మీద కన్ను

దెబ్బతిన్న కిడ్నీలు రక్తంలోని ఫాస్పరస్‌ను అంత సమర్థంగా తొలగించలేవు. అందుకే కిడ్నీజబ్బు గలవారిలో ఫాస్పరస్ ఎక్కువగా ఉంటుంది. ఇది మరీ పెరిగితే ఇబ్బందికరంగా పరిణమిస్తుంది. ఒంట్లో క్యాల్షియం, ఫాస్పరస్ మోతాదుల సమతుల్యత దెబ్బతిని, ఎముకలు బలహీన పడతాయి. రక్తనాళాల్లో క్యాల్షియం చేరి, గట్టిపడి పూడికలుగా ఏర్పడొచ్చు. దీంతో ఆయా అవయవాలకు రక్త ప్రసరణ తగ్గుతుంది. దీంతో గుండెపోటు, పక్షవాతం వచ్చే ప్రమాద ముంటుంది. కొన్నిసార్లు చర్మం

**దురద పెట్టొచ్చు.**

ఫాస్పరస్ సహజంగా పాలు, పెరుగు, చీజ్, బటర్, పొట్టుతీయని ధాన్యాలతో లభిస్తుంది. పప్పులు, మాంసం వంటి వాటిల్లో ప్రొటీన్‌తో పాటు ఫాస్పరస్ కూడా ఉంటుంది. కాబట్టి మాంసా హారమైనా, శాకాహారమైనా జాగ్రత్త అవసరం. రక్తంలో ఫాస్పరస్ మోతాదులను బట్టి ఏయే పదార్థాలు ఎంతెంత తినాలో నిర్ణయించుకోవాల్సి ఉంటుంది.

ఆహార పదార్థాల్లోని ఫాస్పరస్‌ను శరీరం సగమే శోషించుకుంటుంది. వీటితో పెద్దగా ఇబ్బంది ఉండక పోవచ్చు. కానీ ఫాస్ఫోరిక్ ఆమ్లం కలిపి తయారుచేసే కూల్‌డ్రింక్స్‌లోని ఫాస్పరస్‌ను శరీరం పూర్తిగా తీసుకుంటుంది. కాబట్టి కూల్‌డ్రింక్స్, ఎనర్జీ డ్రింక్స్, సోడాల వంటివి అసలే తాగొద్దు.

### ఉప్పు మితంగా

ఉప్పులోని సోడియం మూలంగా శరీరంలో నీరు ఎక్కువగా చేరుతుంది. దీంతో బరువూ పెరుగుతుంది. అంతేకాదు, నీటితో పాటు రక్తం మోతాదూ పెరగటం వల్ల గుండె మీద ఎక్కువ భారం పడుతుంది. దీంతో రక్తపోటూ పెరుగుతుంది. కిడ్నీలకు అధిక రక్తపోటు పెద్ద శత్రువు. ఇది కిడ్నీలను తీవ్రంగా దెబ్బతీస్తుంది. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ సోడియం వాడకాన్ని రోజు మొత్తంలో 2 గ్రాముల కన్నా (చెంచా కన్నా తక్కువ) మించనీయొద్దు.

వండేటప్పుడు ఎంత ఉప్పు వేస్తామో కచ్చితంగా తెలియదు. అందువల్ల వండిన తర్వాత తినే ముందు కూరల మీద ఉప్పు చల్లుకుంటే మంచిది.

నిల్వ పచ్చళ్లు, సాస్‌లలో ఉప్పు ఎక్కువగా ఉంటుంది. వీటికి దూరంగా ఉండటం మంచిది. అప్పటికప్పుడు రోట్లో నూరుకునే పచ్చళ్లతో పెద్ద ఇబ్బంది ఉండదు.

చిప్స్, బయట శుద్ధిచేసి అమ్మే ఆహార పదార్థాలు, ఉప్పు కలిపి ఎండించిన చేపలకు దూరంగా ఉండటం మంచిది.

ద్రవాలు అవసరమైనంత

కిడ్నీలు చేసే మరో పని ద్రవాల మోతాదులను నియంత్రించటం. పొటాషియం, ఫాస్పరస్ వంటి ఎలక్ట్రోలైట్ల మోతాదులూ ద్రవాలూ ఒకదాని మీద మరోటి ఆధారపడి ఉంటాయి. ఒంట్లో ద్రవాల మోతాదు ఎక్కువైతే వాటిని మూత్రం రూపంలో బయటకు పంపిస్తాయి. అయితే కిడ్నీ జబ్బులో వడపోత సామర్థ్యం, మూత్రం తయారయ్యే ప్రక్రియ నెమ్మదిస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో ద్రవాలు ఎక్కువగా తీసుకుంటే కిడ్నీల మీద మరింత భారం పడుతుంది. ద్రవాలు సరిగా బయటకు రాకపోతే అవి ఒంట్లోనే ఉండిపోతాయి. గుండె, ఊపిరితిత్తుల చుట్టూరా.. కాళ్లలో, ఒళ్లంతా పోగుపడొచ్చు. దీంతో రక్తపోటు పెరగటం, ఆయాసం, కాళ్లు, ముఖం ఉబ్బటం వంటి సమస్యలు తలెత్తుతాయి. కాబట్టి అవసరమైన మేరకే నీరు తాగాలి. కొందరికి రోజుకు రెండు లీటర్ల ద్రవాలు సరిపోతే, కొందరు లీటరుకే పరిమితం చేసుకోవాల్సి రావొచ్చు. ఇది కిడ్నీల వడపోత సామర్థ్యాన్ని బట్టి ఆధారపడి ఉంటుంది. మూత్రం ఎంత వస్తుందనే దాన్ని బట్టి నీరు తాగాలి.

నీరు ఒక్కటే కాదు.. కాఫీ, టీ వంటివీ ద్రవాల కిందికే వస్తాయి. గది ఉష్ణోగ్రత వద్ద కరిగే ఐస్‌క్రీమ్ కూడా ఒకరకంగా ద్రవ పదార్థమే.

నీరు తాగాలని అనిపించినప్పుడు ఓ ద్రాక్షపండును నోట్లో పెట్టుకొని నమలొచ్చు. చిన్న ఐస్‌ముక్కను నోట్లో పెట్టుకోవచ్చు. నోరు తడారుతున్నట్టు అనిపిస్తే పిప్పరమెంటు బిళ్లల వంటివి చప్పరించొచ్చు. దీంతో లాలాజలం ఊరుతుంది. దప్పిక తగ్గుతుంది.

డయాలిసిస్ చేయించుకునేవారికి చికిత్సకు ముందు, తర్వాత బరువు కొలుస్తుంటారు. రెండు డయాలసిస్‌ల మధ్య 2–3 కిలోల కన్నా ఎక్కువ బరువు పెరగకూడదు. అంతకన్నా ఎక్కువగా పెరిగితే ద్రవాలు ఎక్కువగా తీసుకుంటున్నారనే అర్థం. డయాలిసిస్‌తో మొత్తం ద్రవాలను తొలగించటం సాధ్యం కాదు. కాబట్టి ముందే తగ్గించుకోవటం ఉత్తమం.

పొటాషియం సరిగా

కిడ్నీ జబ్బు బాధితుల్లో పొటాషియం మోతాదులు ఎక్కువగా ఉంటాయి. ఇది గుండె, కండరాల సమస్యలకు దారితీస్తుంది. కాబట్టి పొటాషియం మోతాదులు సరిగా ఉండేలా చూసుకోవాలి.

అరటి, బత్తాయి, నారింజ, మామిడి పండ్లలో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. మొక్కజొన్న, కిస్‌మిస్ వంటి ఎండు ఫలాలు.. బాదం, జీడిపప్పు వంటి గింజపప్పుల్లోనూ ఎక్కువే. కాబట్టి వీటిని తగ్గించుకోవాలి. మానేస్తే మంచిది. పొటాషియం తక్కువగా ఉండే యాపిల్, ద్రాక్షపండ్లు, జామ, పైనాపిల్, నేరేడు, స్ట్రాబెర్రీ, సీతాఫలం వంటివి మితంగా తీసుకోవచ్చు.

కూరగాయల్లో సొరకాయ, బీరకాయ, దొండకాయ, క్యాబేజీ, కాలీఫ్లవర్, కీరా, బెండకాయ, కాకరకాయ, ఉడికించిన క్యారెట్ వంటి వాటిల్లో పొటాషియం కాస్త తక్కువగా ఉంటుంది. వీటిని తినొచ్చు.

టొమాటో, బంగాళాదుంప, పాలకూర, చిలగడదుంప, కొబ్బరి, అరటికాయల్లో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. వీటిని పరిమితం చేసుకోవాలి లేదా మానెయ్యాలి.

కూరగాయల్లో పొటాషియంను తగ్గించుకోవటానికి ఒక చిట్కా ఉంది. కూరగాయలను చెక్కు తీసి, ముక్కలుగా కోసి మూడు, నాలుగు గంటల సేపు గోరువెచ్చటి నీటిలో నానబెట్టాలి. తర్వాత నీటిని వడగట్టి, ఉడికించి వండుకుంటే పొటాషియం కొంతవరకు తగ్గే అవకాశముంది. రాత్రిపూట గోరువెచ్చటి నీటిలో నానబెట్టి, మర్నాడు కూడా వండుకోవచ్చు.

విటమిన్ డి, విటమిన్లు అవసరం

విటమిన్ డి చురుకుగా మారటం కిడ్నీల మీద ఆధారపడి ఉంటుంది. అంటే కిడ్నీల పనితీరు తగ్గుతున్నకొద్దీ విటమిన్ డి మోతాదులూ పడిపోతుంటాయన్నమాట. అందువల్ల విటమిన్ డి మాత్రలు తీసుకోవాల్సి ఉంటుంది. కొందరికి క్యాల్షియం మాత్రలూ అవసరమవ్వచ్చు.

కొందరికి బి విటమిన్లు, ఐరన్ కూడా తగ్గొచ్చు. వీటిని భర్తీ చేయటమూ అవసరమే.

వ్యాయామం కీలకం

కిడ్నీ, గుండె ఆరోగ్యం ఒకదాంతో మరోటి ముడిపడి ఉంటాయి. కాబట్టి కిడ్నీజబ్బు బాధితులకు వ్యాయామం తప్పనిసరి. డాక్టర్ సలహా మేరకు నడక, జాగింగ్ వంటి ఏరోబిక్ వ్యాయామాలు చేయొచ్చు. ఇంట్లోనూ యోగాసనాల వంటివి వేయొచ్చు. క్యాల్షియం తగ్గటం వల్ల ఎముకలు పెళుసుబారే ప్రమాదముంది. అందువల్ల తేలికపాటి బరువులెత్తే వ్యాయామాలూ అవసరమే. ఆడవారికిది మరింత ముఖ్యం. దీంతో ఎముకలు, కండరాలు బలపడతాయి.

కొవ్వులు తక్కువగా

కిడ్నీజబ్బు గలవారిలో కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్లు, చెడ్డ కొలెస్ట్రాల్ పెరుగుతుంటాయి. అదే సమయంలో మంచి కొలెస్ట్రాల్ తగ్గుతుంది. కాబట్టి నూనె, వెన్న, నెయ్యి, వనస్పతి వంటివి తగ్గించుకోవాలి. వేపుళ్లు అసలే తినొద్దు.


# ఆర్థిక పరివర్తనకు మూలస్తంభాలు!

జనరల్ స్టడీస్
ఇండియన్ జాగ్రఫీ

మానవుడు వ్యవసాయం నుంచి పరిశ్రమలు, సేవా రంగాల వైపు వేసిన అడుగులు నగరాల రూపంలో సరికొత్త నాగరికతకు ప్రాణం పోశాయి. ప్రాచీన సింధూ నాగరికత నుంచి నేటి నవీన మహానగరాల వరకు భారతదేశంలో పట్టణీకరణ సుదీర్ఘమైన, వైవిధ్యభరితమైన చారిత్రక ప్రస్థానాన్ని కలిగి ఉంది. కేవలం జనసాంద్రత కలిగిన నివాస ప్రాంతాలుగానే కాకుండా సంస్కృతికి, ఆర్థిక పురోగతికి, పరిపాలనాధికారానికి ప్రధాన కేంద్రాలుగా ఈ 'నగర జనపదాలు' వర్ధిల్లాయి.

ప్రాచీన, మధ్యయుగ, ఆధునిక కాలాల్లో వాటి రూపురేఖలు మారిపోయాయి. శతాబ్దాల తరబడి రూపాంతరం చెందుతూ వచ్చిన పట్టణ వ్యవస్థలు, నేడు దేశ సమ్మిళిత అభివృద్ధికి, ప్రాంతీయ అనుసంధానతకు కీలక చోదక శక్తులుగా నిలుస్తున్నాయి. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా ఆవిర్భవిస్తున్న ఇటువంటి వైవిధ్యభరిత నగరాలు ఆర్థిక మార్పులకు మాత్రమే కాకుండా, సామాజిక చైతన్యానికి కూడా ప్రతిబింబాలుగా మారాయి. జనాభా, వృత్తుల ప్రాతిపదికన భారత ప్రభుత్వం, భూగోళ శాస్త్రజ్ఞులు వీటిని ఏ విధంగా వర్గీకరించారో పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి.






**నగర జనపదాలు**

కేంద్రీకృత నివాసాలు ఎక్కువ మొత్తంలో ఉన్న ప్రాంతాలనే పట్టణ లేదా నగర జనపదాలు అంటారు. ఇక్కడ వ్యవసాయం చేసేవారే కాకుండా ద్వితీయ, తృతీయ రంగాలైన పరిశ్రమలు, సేవారంగాల్లో పనిచేసే ఉద్యోగులూ నివసిస్తారు. నగరాలు వాటి చుట్టూ ఉన్న గ్రామీణ ప్రాంతాలతో క్రియాత్మకంగా అనుసంధానించి ఉంటాయి. పట్టణ ప్రాంతాలను సాధారణంగా జనాభా పరిమాణం, జనసాంద్రత, నివాసితుల వృత్తులు, స్థానిక ప్రభుత్వ రకం ఆధారంగా నిర్వచిస్తారు. భారతదేశంలో పట్టణాలు చరిత్ర పూర్వకాలం నుంచి వర్ధిల్లాయి. దేశ చరిత్ర ఆధారాల ప్రకారం మొదటగా పేర్కొనే సింధూ నాగరికత, హరప్పా, మొహంజోదారో లాంటి పట్టణాల్లో ఉనికి ఉండేది. క్రీ.శ.18వ శతాబ్దంలో భారతదేశానికి ఐరోపావాసులు వచ్చే వరకు పట్టణ నాగరికత కొనసాగింది.

పరిణామం ఆధారంగా భారతీయ పట్టణాలు

వివిధ కాలాల్లో వాటి పరిణామాల ఆధారంగా భారతీయ పట్టణాలు పలు విధాలుగా ఉన్నాయి.

పురాతన పట్టణాలు: భారతదేశంలో 2000 ఏళ్లకు పైగా చారిత్రక నేపథ్యం ఉన్న పట్టణాలు అనేకం ఉన్నాయి. ఇవి మత, సాంస్కృతిక కేంద్రాలుగా విలసిల్లాయి. ఉదా: వారణాసి, ప్రయాగ (అలహాబాద్), పాటలీపుత్రం (పట్నా), మధురై, తిరుపతి.

మధ్యయుగ పట్టణాలు: ప్రస్తుతం ఉన్న వందకు పైగా నగరాల మూలాలు మధ్యయుగం నాటివి. వాటిలో చాలావరకు సంస్థానాలు, రాజ్యాలకు ప్రధాన కార్యాలయాలుగా అభివృద్ధి చెందాయి. మరికొన్ని ప్రాచీన పట్టణాల శిథిలాలపై కోట పట్టణాలుగా వెలిశాయి. ఉదా: దిల్లీ, జైపుర్, లఖ్‌నవూ, ఆగ్రా, నాగపుర్, హైదరాబాద్, వరంగల్.

ఆధునిక పట్టణాలు: బ్రిటిష్, ఐరోపావాసులు భారతదేశంలో అనేక పట్టణాలను నిర్మించారు. తీరప్రాంతాల్లో తమ పట్టును సాధించి మొదటగా సూరత్, డామన్, గోవా, పుదుచ్చేరి లాంటి వాణిజ్య ఓడరేవులను అభివృద్ధి చేశారు. ఆ తర్వాత ముంబయి(నాటి బొంబాయి), చెన్నై(మద్రాసు), కోల్‌కతా (కలకత్తా)లలో తమ ప్రధాన కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నారు. వాటి చుట్టూ తమ పట్టును పటిష్ఠం చేసుకుని వారి శైలిలో నిర్మాణాలు చేపట్టారు.

భూగోళ శాస్త్రజ్ఞుల ఆధారంగా పట్టణాలు

1850 తర్వాత పరిశ్రమల ఆధారంగా పట్టణాలు అభివృద్ధి చెందాయి. ఉదా: జంషెడ్‌పూర్. స్వాతంత్ర్యం అనంతరం పరిపాలనాపరంగా చండీగఢ్, భువనేశ్వర్, గాంధీనగర్, దిస్పూర్ తదితర ప్రాంతాలు; పారిశ్రామిక పట్టణాలుగా దుర్గాపుర్, భిలాయ్, సింద్రి, బరేని వృద్ధి చెందాయి. భారత ప్రభుత్వ జనగణనశాఖ భూగోళ శాస్త్రజ్ఞుల ఆధారంగా పట్టణప్రాంతాలను పలు రకాలుగా వర్గీకరించారు. అవి–

గ్రామీణ కేంద్రం: 9,999 వరకు జనాభా

సెమీ-అర్బన్ (సబర్బన్): 10,000 నుంచి 99,999 మధ్య జనాభా

పట్టణ కేంద్రం: 1,00,000 నుంచి 9,99,999 మధ్య జనాభా

మిలియన్ ప్లస్ నగరాలు: 10,00,000 నుంచి ఆపై జనాభా ఉన్న నగరాలు

మెట్రో నగరాలు: నాలుగు మిలియన్లు లేదా అంతకంటే ఎక్కువ జనాభా.

2011 జనాభా లెక్కల్లో పట్టణాలు

2011 జనాభా లెక్కల ప్రకారం ఒక పట్టణ ప్రాంతం రెండు రకాల పరిపాలనా విభాగాలను కలిగి ఉంటుంది.

1) శాసనబద్ధ పట్టణాలు: మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, కంటోన్మెంట్ బోర్డులు, నోటిఫైడ్ టౌన్ ఏరియాలు, కమిటీ, టౌన్ పంచాయతీలు, నగర పాలికలు మొదలైనవి. శాసనం ద్వారా పట్టణాలుగా నిర్వచించిన అన్ని పరిపాలనా విభాగాలను శాసనబద్ధ పట్టణాలు అంటారు.

2) జనాభా గణన పట్టణాలు: ఒక నివాస ప్రాంతంలో కనీసం 5,000 మంది జనాభా ఉండాలి. వారిలో కనీసం 75% పురుష శ్రామిక జనాభా వ్యవసాయేతర రంగాల్లో నిమగ్నమై ఉండాలి. ప్రతి చదరపు కి.మీ.కి 400 మంది జనసాంద్రత ఉండాలి. ఈ మూడు విషయాలను ఒకేసారి సంతృప్తిపరిచే ప్రాంతాలను 'జనాభా గణన పట్టణాలు' అంటారు.

**పట్టణ కేంద్రాల పరిమాణాత్మక వర్గీకరణ**

పట్టణ గ్రామం: పట్టణ గ్రామాల్లో జనాభా ఎక్కువగా వ్యవసాయేతర కార్యకలాపాల్లో ఉంటారు. అయినప్పటికీ భూ వినియోగంలో వ్యవసాయం, దాని అనుబంధ కార్యకలాపాలదే ఆధిపత్యం. ఇక్కడ గ్రామీణ, పట్టణ కార్యకలాపాలు రెండూ ఉంటాయి.

పట్టణం/టౌన్: ఇది సాధారణంగా లక్ష కంటే తక్కువ జనాభా ఉండే ప్రాంతం. పట్టణాల పరిమాణం దేశాన్ని బట్టి మారుతుంది. ఇక్కడ తయారీరంగం, టోకువర్తకం, వృత్తి ఉపాధి కార్యకలాపాలు ఉంటాయి.

నగరం: భారత్‌లో లక్ష కంటే ఎక్కువ జనాభా ఉన్న పట్టణమే నగరం.

మెట్రోపాలిటన్ (మహానగరం): ఇది అధిక జనాభా ఉన్న పట్టణ కేంద్రం. చుట్టూ తక్కువ జనాభా ఉన్న సబ్-అర్బన్‌లు ఉంటాయి. జనాభా పది లక్షలకు పైగా ఉంటుంది. వీటినే 'మిలియన్ ప్లస్' సిటీలు లేదా నగరాలు అంటారు. భారత్‌లో 53 మెట్రోపాలిటన్ నగరాలు ఉన్నాయి.

మెగా సిటీస్: ఇవి 5 మిలియన్లు, అంతకంటే ఎక్కువ జనాభా ఉన్న నగరాలే మెగా సిటీలు. ఉదా: గ్రేటర్ ముంబయి, కోల్‌కతా, దిల్లీ.

మెగాలో పోలిస్: ఈ మెగాలో పోలిస్ అనే పదాన్ని జీన్ గాట్‌మెన్ ఉపయోగించారు. ఇది గ్రీకు పదం. ఇది 'గొప్ప నగరం' అనే పదాలను కలిపి మెగాలో పోలిస్‌గా అభివర్ణించాడు. 1964లో యునైటెడ్ స్టేట్స్‌లో పట్టణ సముదాయాన్ని వర్ణించడానికి ఈ పదాన్ని స్వీకరించాడు. భారత్‌లో మెగాలో పోలిస్ సిటీ (నగరం) లేదు.

కనెర్బేషన్: ఈ పదాన్ని పాట్రిక్ గెడ్డెస్ రూపొందించారు. ప్రధాన నగరాలు ఒకదాని వెంట మరొకటి కలిసిపోయి ఏర్పడిన ప్రాంతాన్ని కనెర్బేషన్ అంటారు. ఉదా: గ్రేటర్ లండన్.

## షిప్ బిల్డింగ్ సెంటర్‌లో



**కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే షిప్ బిల్డింగ్ సెంటర్ (ఎస్‌బీసీ), విశాఖపట్నం.. 09 గ్రూప్-సీ, టెక్నికల్/ నాన్-టెక్నికల్, నాన్-గెజిటెడ్ పోస్టులు భర్తీచేయనుంది. వీటికి పదో తరగతి, ఐటీఐతో దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్షతో నియామకాలుంటాయి.**

పోస్టు: కన్‌స్ట్రక్షన్ అసిస్టెంట్-ఏ (లెవెల్-2) ఖాళీలు: 03
అర్హత: పదోతరగతి, ఫిట్టర్ ట్రేడ్‌తో ఐటీఐ/ నేషనల్ అప్రెంటిస్ సర్టిఫికెట్/ తత్సమాన కోర్సు, సంబంధిత రంగంలో రెండేళ్ల అనుభవం ఉండాలి.
పోస్టు: కన్‌స్ట్రక్షన్ హ్యాండ్లర్ (లెవెల్-1) ఖాళీలు: 02
అర్హత: పదో తరగతి, ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌తో ఐటీఐ.
పోస్టు: ఫైర్ ఇంజిన్ డ్రైవర్ (లెవెల్-3) ఖాళీలు: 03
అర్హత: పదోతరగతి, హెవీ మోటార్ వెహికల్స్ డ్రైవింగ్ లైసెన్స్, శారీరక సామర్థ్యం, మూడేళ్ల ఉద్యోగానుభవం, మోటార్ మెకానిజం తెలిసుండాలి.
పోస్టు: సివిలియన్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్ (లెవెల్-2)
ఖాళీలు: 01
అర్హత: పదోతరగతి, లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్, మోటార్ మెకానిజం పరిజ్ఞానం, మూడేళ్ల ఉద్యోగానుభవం ఉండాలి. హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారికి ప్రాధాన్యమిస్తారు.
ఎంపిక: విద్యార్హతలు, ఉద్యోగానుభవాలతో స్క్రీనింగ్ చేసి రాత పరీక్షకు షార్ట్‌లిస్ట్ చేస్తారు. అన్ని పోస్టులకూ కంప్యూటర్ బేస్డ్ టెస్టు (సీబీటీ) ఉంటుంది. ఫైర్ ఇంజిన్ డ్రైవర్, సివిలియన్ మోటార్ ట్రాన్స్‌పోర్టు డ్రైవర్ పోస్టులకు అదనంగా ఎండ్యూరెన్స్, స్కిల్ టెస్టులు ఉంటాయి.
కన్‌స్ట్రక్షన్ అసిస్టెంట్, కన్‌స్ట్రక్షన్ హ్యాండ్లర్ పోస్టులకు.. సీబీటీ మల్టిపుల్ ఛాయిస్ విధానంలో 100 మార్కులకు హిందీ, ఇంగ్లిషుల్లో ఉంటుంది. జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌ల నుంచి 20 ప్రశ్నల చొప్పున ఇస్తారు. సబ్జెక్టు సంబంధిత అంశాలకు 40 మార్కులు. వ్యవధి 120 నిమిషాలు. సీబీటీ సిలబస్‌ను ప్రకటనలో పేర్కొన్నారు. దాని ప్రకారం పరీక్షకు సన్నద్ధమైతే ఎక్కువ మార్కులు సాధించవచ్చు.
ఫైర్ ఇంజిన్ డ్రైవర్, సివిలియన్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్ పోస్టులకు.. జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, జనరల్ ఇంగ్లిష్‌ల నుంచి 25 ప్రశ్నల చొప్పున ఇస్తారు. వ్యవధి 120 నిమిషాలు. ప్రశ్నకు ఒక మార్కు. రుణాత్మక మార్కులు లేవు.
సీబీటీలో అర్హత కోసం అన్‌రిజర్వుడ్ అభ్యర్థులు 35 శాతం, ఓబీసీ-30 శాతం, ఇతర వర్గాలవారు 25 శాతం మార్కులు సాధించాలి. వీరిని 1:15 నిష్పత్తిలో ఎండ్యూరెన్స్ టెస్టుకు షార్ట్‌లిస్ట్ చేస్తారు. ఇందులో భాగంగా.. ఇసుక, నీళ్లతో నింపిన బకెట్లను 45 సెకన్ల వ్యవధిలో 100 మీటర్ల దూరం మోసుకెళ్లగలగాలి. స్క్వాట్స్ 20, పుషప్స్ 15, సిటప్స్ 15 తీయగలగాలి. ఇందులో అర్హత సాధించినవారిని 1:15 నిష్పత్తిలో స్కిల్ టెస్టుకు ఎంపిక చేస్తారు. అందులో భాగంగా డ్రైవింగ్ నైపుణ్యం, ప్రభుత్వ రవాణా నిబంధనలు, చిహ్నాలపై అవగాహన, మోటార్ మరమ్మతుల పరిజ్ఞానాన్ని పరీక్షిస్తారు.

# ద్వంద్వ ప్రభుత్వానికి చరమగీతం.. కలెక్టర్ పదవికి శ్రీకారం!

వ్యాపారం నిమిత్తం భారతదేశానికి వచ్చిన ఆంగ్లేయులు క్రమేణా దేశ అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవడం మొదలుపెట్టారు. ఇక్కడి రాజుల అనైక్యతను ఆసరాగా చేసుకుని రాజకీయంగా బలం పుంజుకుని, పాలనపై పట్టు సాధించే స్థాయికి ఎదిగారు. యుద్ధాలు, ఒప్పందాలతో ఒక్కో రాజ్యంపై తమ ఆధిపత్యాన్ని సుస్థిరం చేసుకున్నారు. బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ భారతదేశంలో తమ శక్తి సామర్థ్యాలను ప్రదర్శించే ప్రారంభ దశలో బెంగాల్ గవర్నర్లు ప్రముఖ పాత్ర పోషించారు. వీరు తమ పాలనా కాలంలో న్యాయవ్యవస్థ, భూసంస్కరణలు, విస్తరణ విధానాలతో పలు కీలక మార్పులు చేపట్టారు.


గవర్నర్ జనరల్ యుగం-బెంగాల్ గవర్నర్లు

రాబర్ట్ క్లైవ్

క్లైవ్ బెంగాల్ గవర్నర్‌గా పనిచేసిన కాలాన్ని భారతదేశ చరిత్రలో అత్యంత కీలకదశగా పేర్కొనవచ్చు. ఇతడు భారతదేశానికి రెండుసార్లు గవర్నర్ జనరల్‌గా వ్యవహరించాడు.

రాబర్ట్ క్లైవ్(1765-67) రెండో దఫా గవర్నర్‌గా ఉన్న కాలంలో భారతదేశ చరిత్రలో ముఖ్యమైన పరిపాలనా, ఆర్థిక మార్పులు ప్రవేశపెట్టాడు.

1764లో జరిగిన బక్సార్ యుద్ధం తర్వాత బ్రిటిష్



ఈస్ట్ ఇండియా కంపెనీకి బెంగాల్ ప్రాంతంపై స్పష్టమైన ఆధిపత్యం ఏర్పడింది. ఈ విజయాన్ని రాజకీయంగా స్థిరపరచడానికి క్లైవ్ 1765లో మొగల్ చక్రవర్తి షా ఆలమ్‌ఖిఖితో అలహాబాద్ సంధి చేసుకున్నాడు.

ఈ సంధి ప్రకారం కంపెనీకి బెంగాల్, బిహార్, ఒడిశా ప్రాంతాలపై 'దివానీ హక్కులు' లభించాయి. అంటే ఆ ప్రాంతాల ఆదాయాన్ని సేకరించే పూర్తి హక్కు కంపెనీకి వచ్చింది.

క్లైవ్ ఈ దివానీ హక్కులను వినియోగించుకునే క్రమంలో 'ద్వంద్వ ప్రభుత్వాన్ని' ప్రవేశపెట్టాడు. ఈ విధానంలో ఆదాయం సేకరించే బాధ్యత కంపెనీకి ఉండగా, పరిపాలనా బాధ్యతలు నవాబ్ చేతుల్లోనే ఉంటాయి.

కంపెనీ ఆదాయాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకుంటూ, పరిపాలనా బాధ్యతల నుంచి తప్పించుకుంది. నవాబ్ వద్ద తగిన ఆర్థిక వనరులు లేకపోవడంతో పరిపాలనా వ్యవస్థ గాడితప్పింది.

కంపెనీ అధికారులు ఎక్కువగా ఆదాయ సేకరణపైనే దృష్టి పెట్టి, రైతులపై అధిక పన్నులు విధించారు. దీంతో రైతుల జీవితం దుర్భరంగా మారింది. ప్రజల సంక్షేమం పట్ల నిర్లక్ష్యం వహించారు. వ్యవసాయ రంగం క్షీణించడంతో ఆర్థిక వ్యవస్థపైనా ప్రతికూల ప్రభావం పడింది.

ఈ విధానం పరిపాలనా బాధ్యతలను స్పష్టంగా నిర్వచించకపోవడంతో ప్రభుత్వ వ్యవస్థలో గందరగోళం ఏర్పడింది. కంపెనీ లాభాలు దండుకుంటే, ప్రజల జీవన ప్రమాణాలు మాత్రం పడిపోయాయి.

క్లైవ్ పాలనలో మరో ముఖ్యమైన అంశం కంపెనీ సైనిక వ్యవస్థను బలపరచడం. ఇతడు స్థానికులను సైనికులుగా నియమించి, శక్తిమంతంగా మార్చాడు. ఈ సైన్యం ద్వారా బ్రిటిష్ వారు ఇతర ప్రాంతాలను సులభంగా ఆక్రమించగలిగారు.

క్లైవ్ పాలనలో జరిగిన అవినీతి, ప్రజలపై జరిగిన ఆర్థిక దోపిడీపై విమర్శలు వచ్చాయి. బ్రిటన్‌లో క్లైవ్ చర్యలపై విచారణ జరిగింది.

వారన్ హేస్టింగ్స్

వారన్ హేస్టింగ్స్(1772-85) భారతదేశంలో బ్రిటిష్ పరిపాలనను క్రమబద్ధం చేసి స్థిరపరచిన తొలి శక్తిమంతమైన పరిపాలకుడిగా గుర్తింపు పొందాడు. ఇతడి పాలన ప్రారంభమైనప్పుడు బెంగాల్లో పరిస్థితులు చాలా దారుణంగా ఉండేవి.

ద్వంద్వ ప్రభుత్వ విధానం వల్ల ఏర్పడిన సమస్యలను గమనించి 1772లో ఈ విధానాన్ని పూర్తిగా రద్దు చేశాడు. తద్వారా కంపెనీ నేరుగా పరిపాలన



చేపట్టింది. దీంతో పరిపాలనలో స్పష్టత వచ్చింది. పాలన క్రమబద్ధంగా మారింది.

పన్నుల సేకరణను సమర్థవంతంగా నిర్వహించేందుకు 'బోర్డ్ ఆఫ్ రెవెన్యూ'ను ఏర్పాటు చేశాడు. ఈ బోర్డు ఆదాయ వసూలును పర్యవేక్షిస్తూ, ప్రభుత్వానికి స్థిరమైన ఆదాయం వచ్చేలా చూసింది.

జిల్లాల స్థాయిలో ఆదాయ సేకరణను నిర్వహించడానికి 'కలెక్టర్' అనే పదవిని ప్రవేశపెట్టాడు. కలెక్టర్ పన్నుల వసూళ్లకే పరిమితం అవ్వకుండా, స్థానిక పరిపాలనను కూడా పర్యవేక్షించాలి.

ఈ విధానం బ్రిటిష్ పాలనలో అత్యంత కీలకంగా మారి, భారతదేశంలో జిల్లా పరిపాలనకు పునాది వేసింది.

హేస్టింగ్స్ తన కాలంలో రైతుల నుంచి నేరుగా ఆదాయం సేకరించే ప్రయత్నం చేశాడు. అయితే ఈ విధానం పూర్తిగా విజయవంతం కాలేకపోయినా, తర్వాతి కాలంలో భూసంబంధ సంస్కరణలకు దారితీసింది.

ఇతడి కాలంలో న్యాయవ్యవస్థలోనూ పలు సంస్కరణలు జరిగాయి. భారతీయుల సంప్రదాయాలను గౌరవిస్తూ హిందూ చట్టాలు, ముస్లిం చట్టాల ఆధారంగా న్యాయవ్యవస్థను అమలు చేశాడు. జిల్లాల స్థాయిలో సివిల్, క్రిమినల్ కోర్టులను ఏర్పాటు చేశాడు.

సివిల్ కోర్టులు (దివానీ అదాలత్‌లు) ఆస్తి, పన్నులు లాంటి వివాదాలను పరిష్కరించగా, క్రిమినల్ కోర్టులు (ఫౌజ్‌దారీ అదాలత్‌లు) నేరాలకు సంబంధించిన కేసులను విచారించేవి. ఈ విధంగా న్యాయవ్యవస్థను క్రమబద్ధం చేసి ప్రజలకు న్యాయం అందించే ప్రయత్నం చేశాడు.

ఈ కోర్టులపై పూర్తి నియంత్రణ కంపెనీ అధికారుల చేతుల్లో ఉండటం వల్ల కొన్ని సందర్భాల్లో అన్యాయం జరిగేది. అయినప్పటికీ ఇది భారతదేశంలో ఆధునిక న్యాయవ్యవస్థకు పునాది వేసింది.

ఇతడి కాలంలో బ్రిటిష్ పార్లమెంట్ ఈస్ట్ ఇండియా కంపెనీపై నియంత్రణ పెంచడానికి ప్రయత్నించింది. దీనిలో భాగంగా 1773లో 'రెగ్యులేటింగ్ చట్టాన్ని' ప్రవేశపెట్టారు. ఈ చట్టం ప్రకారం బెంగాల్ గవర్నర్‌కు 'గవర్నర్ జనరల్' హోదా ఇచ్చి, మద్రాస్, బాంబే ప్రెసిడెన్సీలపై పర్యవేక్షణాధికారాన్ని ఇచ్చారు. నలుగురు సభ్యులతో కూడిన కౌన్సిల్‌ను ఏర్పాటు చేసి పరిపాలనలో సమష్టి నిర్ణయాలు తీసుకునే విధానాన్ని ప్రవేశపెట్టారు. హేస్టింగ్స్ పాలనలో రాజకీయ రంగంలోనూ పలు సంఘటనలు జరిగాయి. స్థానిక పాలకులతో ఒప్పందాలు చేసుకుని బ్రిటిష్ ప్రభావాన్ని విస్తరించాడు.

త్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక



## కేవీకే ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో

# 'సద్గురు పురస్కారోత్సవం'






**శ్రీకృష్ణాష్టమి, ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు**

**హైదరాబాద్, త్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 4:**
శ్రీకృష్ణాష్టమి, ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని KVK Fine Arts & Melodies (Cultural Organisation) ఆధ్వర్యంలో సంగీత, సాహిత్య, నృత్య, సాంస్కృతిక రంగాలకు చెందిన ఉపాధ్యాయులను గౌరవిస్తూ 'సద్గురు పురస్కారోత్సవం' నిర్వహించారు, శుక్రవారం సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు హైదరాబాద్ నాంపల్లిలోని ఎస్పీఆర్ తెలుగు విశ్వవిద్యాలయం, ఎన్టీఆర్ ఆడిటోరియంలో కార్యక్రమం జరిగింది.
ఈ వేడుకకు తెలంగాణ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గౌరవ అతిథులుగా గరుడవేగ ఇంటర్నేషనల్ కొరియర్--నెక్సెన్ లాజిస్టిక్స్ సీఈఓ లక్కవరపు సతీష్, సీఎఫ్ఓ శ్రీనాథ్ రెడ్డి పాల్గొనారు. కళాపత్రిక చీఫ్ ఎడిటర్ డా. ఎస్.కె. మహమ్మద్ రఫీ అధ్యక్షత వహించగా, ప్రముఖ గాయకుడు, కెనరా బ్యాంక్ రిటైర్డ్ డీఎం యల్లాప్రగడ అమరేశ్వరరావు పాలుపంచుకున్నారు.
ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బి.వి.ఎస్.ఆర్.ఎస్. శర్మ, డా. అన్నదానం వి. సుబ్రహ్మణ్యం, రమా బండారు, శిష్ట మంజుల తదితరులను ప్రత్యేకంగా సత్కరించారు. ప్రత్యేక ఆహ్వానితులు, సలహాదారులుగా డా. వంశీ రామరాజు, చెబ్రోలు శశిబాల, మహమ్మద్ షబ్బుద్దీన్ హాజరయ్యారు.
ప్రముఖ శాస్త్రీయ నృత్యకారిణి, కొరియోగ్రాఫర్, నృత్య గురువు పి. జ్వాలాముఖి దేవి పర్యవేక్షణలో శ్రీకృష్ణ సంగీత నృత్య కళాశాల విద్యార్థులు ప్రత్యేక నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. కేవీకే ఫైన్ ఆర్ట్స్ అండ్ మెలోడీస్ అధ్యక్షుడు కుప్ప వెంకట కృష్ణమోహన్ కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కళాభిమానులు, సంగీత--నృత్య ప్రియులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా ముగింపు పలికారు.

# శ్రీకృష్ణ భక్తి సంగీత, కవితా మకరందం




**హైదరాబాద్, చిక్కడపల్లి , త్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 4:**
మోహన్ ట్రస్ట్ సమర్పణలో శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా ఆధ్వర్యంలో "భగవద్గీత పారాయణోత్సవం" శ్రీత్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళావేదికలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా
"శ్రీకృష్ణ భక్తి సంగీత, కవితా మకరందం" పేరుట ప్రముఖ గాయనీ , గాయకులు ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి.

# హృదయమే బృందావనం

ప్రతి పండుగకు చారిత్రక, ఆధ్యాత్మిక నేపథ్యాలుంటాయి. శ్రీకృష్ణాష్టమి అనే మహోత్సవానికి చరిత్ర, భక్తి, తత్వం, జీవనదర్శనం, వేదాంతం అన్నీ ఒకేచోట సంగమించిన విశిష్టత ఉంది. అందుకే కృష్ణావతార ఘట్టం మానవ చైతన్య వికాసానికి ఒక శాశ్వత సందేశం. అర్ధరాత్రి కారాగారంలో జన్మించిన కృష్ణుడు, అజ్ఞానాంధకారానికి బంధితుడైన మనిషి మనసులో వెలగాల్సిన జ్ఞానదీపానికి ప్రతీక.
కృష్ణుడి బాల్యలీలలు కేవలం వినోదాత్మక కథలు కావు. వెన్న దొంగిలించడమంటే మన హృదయంలో దాగి ఉన్న నిర్మల ప్రేమను వెలికితీయడం. గోవర్ధన గిరిని ఎత్తడం అంటే ప్రకృతి పరిరక్షణకు, మూఢాచారాలపై వివేకానికి ప్రతీక. కాళీయ మర్దనం అంటే విషపూరితమైన అహంకారం, క్రోధం, ద్వేషం వంటి లోపలి మలినాలపై విజయం. భగవద్గీతలో కృష్ణుడు ఇచ్చిన సందేశం యుగయుగాలకు మార్గదర్శకం. 'కర్మణ్యేవాధికారస్తే' అంటూ కర్తవ్యాన్ని బోధించిన ఆయన, 'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ' అంటూ పరమాత్మలో లయమవ్వడమే జీవిత పరమార్థమని ప్రకటించాడు. కృష్ణుడు యోధుడు, రాజకీయవేత్త, గురువు, స్నేహితుడు, ప్రేమికుడు, తత్వవేత్త– అన్నింటినీ సమన్వయపరిచిన సంపూర్ణ వ్యక్తిత్వం.
వేదాంత దృష్టిలో కృష్ణుడు ఒక చైతన్యం. ఆయన వేణుగానం విశ్వనాదానికి సంకేతం. రాసలీల– జీవాత్మ పరమాత్మల ఐక్యానికి ప్రతీక. గోపికల భక్తి– ఆత్మ తన మూలాన్ని చేరుకోవాలనే తపన. బృందావనంలో కృష్ణుడి వేణునాదం వినిపించిందని పురాణాలు చెబుతాయి. కానీ, ఆ వేణుగానం ఈనాటికీ ప్రతి మనిషి అంతరంగంలో వినిపిస్తూనే ఉంటుంది. జీవితపు పరుగులో అలసిపోయిన మనసుకు అది శాంతి గీతం. భౌతిక విజయాల మధ్య వెలితిని అనుభవిస్తున్న హృదయానికి అది ఆనంద స్వరం. అందుకే కృష్ణుడు చరిత్రలో మిగిలిన ఒక వ్యక్తి కాదు; సర్వదా మనకు తోడుగా ఉండే నిత్య చైతన్యశక్తి.
కృష్ణుడి జీవితంలో మరో అద్భుతమైన సందేశం ఉంది. ఆయన కారాగారంలో పుట్టాడు, బాల్యం ప్రమాదాల మధ్య గడిచింది, యవ్వనం యుద్ధాలకు సాక్షిగా నిలిచింది. అయినప్పటికీ ఆయన ముఖంలో చిరునవ్వు చెదరలేదు. ప్రతికూలతల మధ్య కూడా ఆనందంగా జీవించడం– కృష్ణతత్వం. నిజానికి కృష్ణాష్టమి అనేది భగవంతుడు భూమిపైకి వచ్చిన రోజు మాత్రమే కాదు; మనిషి తనలోని దైవత్వాన్ని గుర్తుచేసుకునే రోజు. అహంకారపు కంసుణ్ని జయించి, ప్రేమ అనే యమునను దాటి, జ్ఞానమనే గోకులాన్ని చేరినప్పుడు ప్రతి హృదయంలోనూ కృష్ణుడు జన్మిస్తాడు. అందుకు కావాల్సిందల్లా పవిత్రమైన మనసు, నిర్మలమైన భక్తి.

# భారతీయ సాంప్రదాయ కళలను భావితరాలకు అందించా






**హైదరాబాద్, రవీంద్ర భారతి, త్రైనెట్ న్యూస్ సెప్టెంబరు 4 :**
భారతీయ సాంప్రదాయ కళలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యుడు రమణారావు అన్నారు. శివ పార్వతి నాట్య అకాడమీ ఆధ్వర్యంలో ప్రభుత్వ తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో 'మంజీరనాదం' పేరిట సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు రవీంద్రభారతిలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రమణారావు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ నృత్య, కళా సంస్కృతిని ప్రోత్సహించడంతో పాటు కళాకారులను ఒకే వేదికపైకి తీసుకురావడం అభినందనీయమన్నారు. తమ పిల్లలను కళా రంగంలో ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. సభకు ముందు శివ పార్వతి నాట్య అకాడమీ వ్యవస్థాపకులు, డైరెక్టర్ చెట్టి నాగ శేఖర్ నిర్వహణలో కళాకారులు ప్రదర్శించిన పలు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డా. ఆర్. ప్రసన్న రాణి, దేదీప్య రావు, హరినాథ్ రెడ్డి, సత్య మాస్టర్, డా. శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అలరించిన 'పాటల పూదోట'

# సినీ సంగీత విభావరి

**హైదరాబాద్, చిక్కడపల్లి, త్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 4:**
శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో 'పాటల పూదోట' పేరుతో సినీ సంగీత విభావరి శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా మారుతి కళా వేదికలో నిర్వహించారు. శిఖరం ఆర్ట్ థియేటర్స్ అధ్యక్షుడు జి. కృష్ణ నిర్వహణలో గాయనీ గాయకులుప్రముఖ గాయని సాయి పవని, వెంకీ, ఇంద్రాణి, భాగ్యలక్ష్మి, సరస్వతి, రమణ, ఏడుకొండలు, సుబ్బిరెడ్డి, ఆనంద్ తదితరులు ఆలపించిన సినీ గీతాలు అలరించాయి.




## శ్రీ పోతన భాగవత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**హైదరాబాద్, చిక్కడపల్లి, త్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 4:**
శ్రీ పోతన భాగవత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా "సతులారా చూడరే శ్రావణ బహుళాష్టమి" పేరుతో భక్తి సంగీత విభావరి త్యాగరాయ గానసభలోని కళా వెంకట దీక్షితులు కళా వేదికలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంగరాజు లక్ష్మి ఆధ్వర్యంలో ప్రముఖ గాయనీ గాయకులు ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి.




edited, Printed, Published and Owned by:Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136